నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com



హైదరాబాద్ | ఆదివారం 23-5-2021 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :27 | సంచిక: 245 | పేజీలు: 4 | వెల: రూ.1/-

అండమాన్‌లో ప్రవేశించిన రుతుపవనాలు!

హైదరాబాద్ , మే 22: నైరుతి రుతుపవనాలు ఈ సారి ముందే పలకరిస్తున్నాయి. శుక్రవారం దక్షిణ అండమాన్ సముద్రంలో పూర్తిగా, దక్షిణ బంగాళాఖాతం, ఉత్తర అండమాన్ సముద్రంలో పలు ప్రాంతాల్లో ప్రవేశించాయి. సాధారణంగా మే 22న రుతుపవనాలు దక్షిణ అండమాన్ సముద్రంలోకి వస్తాయి. ఈ ఏడాది ఒకరోజు ముందుగానే వచ్చాయని వాతావరణ శాఖ తెలిపింది. మే 31 నాటికి కేరళ తీరాన్ని తాకే అవకాశముందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడించింది. ఈ ఏడాది వర్షపాతం సాధారణంగా ఉంటుందని అంచనా వేసింది. కాగా, నైరుతి రుతుపవనాల రాకతో అండమాన్, నికోబార్ దీవుల్లో వర్షాలు కురుస్తున్నాయి. రెండ్రోజులపాటూ? అండమాన్ దీవులపై తేలికపాటి నుంచి మోస్తరు వర్షం? ఆదివారం వరకూ కురుస్తుంది అని వాతావరణ అధికారులు తెలిపారు. బంగాళాఖాతం, అరేబియా సముద్రంపై గాలుల వేగం? గంటకు 50 నుంచి 60 కిలోమీటర్లు ఉంటుందని తెలిపారు. ఉత్తర అండమాన్ సముద్రాన్ని ఆనుకుని ఉన్న తూర్పు మధ్య బంగాళాఖాతంలో శనివారం అల్పపీడనం ఏర్పడనుందని, ఈ అల్పపీడనం 24వ తేదీ నాటికి తుపానుగా మారుతుందని వెల్లడించింది. ఇది వాయవ్య దిశగా పయనించి ఒడిశా, పశ్చిమ బెంగాల్ మధ్య ఈ నెల 26న తీరాన్ని చేరుతుందని వాతావరణ కేంద్రం తెలిపింది. మే 31వ తేదీ నాటికి రుతుపవనాలు కేరళను తాకుతాయని పేర్కొంది. మరోవైపు తెలుగు రాష్ట్రాలకు జూన్ 15 నుంచి వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయి. ఈలోగా కూడా అప్పుడప్పుడూ తేలిక పాటి వర్షాలు కురుస్తాయని అంచనా వేస్తున్నారు. బంగాళాఖాతంలో అల్పపీడనాలు ఏర్పడుతున్నాయి. వాటి ప్రభావంతో తేలికపాటి వర్షాలు కురుస్తాయని అధికారులు చెబుతున్నారు. జూన్ 15 తర్వాత మాత్రం జోరు వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయి అంటున్నారు.

తెలంగాణ ఒక గొప్ప చిత్రకారున్ని కోల్పోయింది: సీఎం కేసీఆర్

హైదరాబాద్ , మే 22: హైదరాబాద్: ప్రముఖ చిత్రకారుడు గోపి మరణం పట్ల ముఖ్యమంత్రి కే. చంద్రశేఖర్ రావు సంతాపం వ్యక్తం చేశారు. నాలుగు దశాబ్దాల పాటు ఇల్లస్ట్రేటర్‌గా, కార్టూనిస్ట్‌గా తన కుంచెతో అద్భుత ప్రతిభను కనబరిచారని కొనియాడారు. పాలమూరుకు చెందిన గోపి మరణంతో తెలంగాణ ఒక గొప్ప చిత్రకారుడిని కోల్పోయిందని విచారం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గోపి కుటుంబ సభ్యులకు సీఎం కేసీఆర్ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

ప్రముఖ చిత్రకారుడు గోపి (లూసగాని గోపాల్ గౌడ్) కరోనాతో చికిత్స పొందుతూ శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీ దవాఖానలో మరణించిన విషయం తెలిసిందే. బంజారాహిల్స్‌లోని మహాప్రస్థానంలో సాయంత్రం ఆయనకు కొవిడ్ నిబంధనలకు అనుసరించి దహన సంస్కారాలు నిర్వహించారు. 1970, 80 దశకంలో ఆయన మంచి కళాకారుడిగా గుర్తింపు పొందారు.

భారత్‌లో 85 కోట్ల స్పుత్నిక్ టీకాల ఉత్పత్తి..

హైదరాబాద్ , మే 22: సెయింట్ పీటర్స్‌బర్గ్: రష్యాకు చెందిన స్పుత్నిక్-వీ కోవిడ్ టీకాలు హైదరాబాద్‌కు వచ్చిన విషయం తెలిసిందే. అయితే ఆ టీకాల గురించి ఇవాళ సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో ఉన్న భారతీయ దౌత్యాధికారి డీ బాలా వెంకటేశ్ వర్మ మాట్లాడారు. ఇప్పటికే ఇండియాకు ఓసారి లక్షన్నర, ఆ తర్వాత 60 వేల స్పుత్నిక్ టీకాలను పంపించినట్లు తెలిపారు. మే నెల చివరి నాటికి మొత్తం మూడు కోట్ల స్పుత్నిక్ టీకాలను సరఫరా చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. ప్రస్తుతం పంపిన టీకాలను ఇండియాలోనే బాటిళ్లలో నింపనున్నట్లు ఆయన చెప్పారు. ఇక జూన్ నెలలో టీకా డోసుల సంఖ్యను అయిదు కోట్లకు పెంచనున్నట్లు తెలిపారు. ఇండియాలో స్పుత్నిక్ టీకాల ఉత్పత్తి ఆగస్టులో స్టార్ట్ అవుతుందన్నారు. భారత్‌లో మొత్తం 85 కోట్ల స్పుత్నిక్ టీకాలను ఉత్పత్తి చేయనున్నట్లు వెంటకటేశ్ వర్మ తెలిపారు. స్పుత్నిక్ ఉత్పత్తి చేస్తున్న టీకాల్లో.. 70 శాతం వరకు ఇండియాలోనే ఉత్పత్తి అవుతాయన్నారు. భారత్‌లో మూడు దశల్లో స్పుత్నిక్ టీకాలను ఉత్పత్తి చేయనున్నట్లు ఆయన చెప్పారు. తొలుత రష్యా నుంచి టీకాలను సరఫరా చేస్తామని, అది ఇప్పటికే స్టార్ట్ అయ్యిందన్నారు. ఇక బల్క్‌లో ఇండియాకు ఆర్డీఐఎఫ్ టీకాలను పంపుతుందని, ఆ బల్ టీకాలను బాటిళ్లలో నింపాల్సి ఉంటుందన్నారు. ఇక మూడవ దశలో.. రష్యా తన టెకాన్లజీని ఇండియన్ కంపెనీకి బదిలీ చేస్తుందన్నారు. ఆ తర్వాతే హైదరాబాద్‌లోని రెడ్డి ల్యాబ్స్ పూర్తి స్థాయిలో టీకాలను ఉత్పత్తి చేస్తుందన్నారు. అయితే మూడు దశలు కలిపి ఇండియాలో మొత్తం 85 కోట్ల స్పుత్నిక్ టీకాలు ఉత్పత్తి అవుతాయన్నారు. స్పుత్నిక్ లైట్ టీకాలకు ఇంకా భారత్ నుంచి అనుమతి రాలేదని, రెండు దేశాల మధ్య సింగిల్ డోసు స్పుత్నిక్ లైట్ టీకా

హైదరాబాద్‌లో సరుకు రవాణా వాహనాలపై ఆంక్షలు

హైదరాబాద్ , మే 22: నగర పోలీసు కమిషనరేట్ పరిధిలో సరుకు రవాణా వాహనాలపై ఆంక్షలు విధిస్తూ సీపీ అంజనీ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. నేటి నుంచి లాక్‌డౌన్ అమల్లో ఉన్నంత వరకు.. రాత్రి 9 గంటల నుంచి ఉదయం 8 గంటల వరకే సరుకు రవాణా వాహనాలకు అనుమతి ఉంటుందని తెలిపారు. లోడింగ్, అన్‌లోడింగ్ కూడా నిర్దేశించిన వేళల్లోనే అనుమతి ఇస్తామన్నారు. ఉదయం 8 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు సరుకు రవాణా వాహనాలు రోడ్లపైకి వస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీపీ హెచ్చరించారు.

డెలివరీ బాయ్స్ వాహనాలు సీజ్..

హైదరాబాద్ , మే 22: తెలంగాణలో లాక్ డౌన్ ను పోసలు కఠినంగా అమలు చేస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉదయం 10 గంటల నుంచి లాక్ డౌన్ అత్యంత కఠినంగా అమలు చేస్తున్నారు. అనవసరంగా రోడ్లపై వచ్చే వారిపై కేసులు నమోదు చేసి వారి వాహనాల్ని కూడా సీజ్ చేస్తున్నారు. ఈ క్రమంలో జొమాటో, స్విగ్గి డెలివరీ బాయ్స్ వాహనాలను సైతం సీజ్ చేస్తున్నారు. ఈ కామర్స్ లో ఉన్న సేవలకు కూడా అనుమతి లేదని పోలీసులు చెబుతున్నారు. ముందస్తు సమాచారం లేకుండా తమను అపేస్తున్నారంటూ ఈ కామర్స్ డెలివరీ బాయ్స్ అవేదన వ్యక్తం చేస్తున్నారు. జొమాటో తమకు పెనాల్టీ వేస్తుందని, పోలీసుల ఫైన్‌తో నష్టపోతామని బాయ్స్ వాపోతున్నారు. నిత్యావసర వస్తువులు, ఈ కామర్స్ లో ఉన్న సేవలకు అనుమతి ఉంటుందని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. ఇందుకు సంబంధించిన జీవో నెం.102లో పేర్కొంది. అయినా పోలీసులు మాత్రం అనుమతి లేదంటూ డెలివరీ బాయ్స్ వాహనాలను అడ్డుకుంటున్నారు.

మరోవైపు, డీజీపీ మహేందర్ రెడ్డి ఆదేశాల మేరకు పోలీసు ఉన్నతాధికారులకు కఠినంగా వ్యవహరిస్తున్నారు. హైదరాబాద్ తోపాటు అన్ని ప్రధాన నగరాలు, జిల్లా కేంద్రాలు, ప్రధాన నగరాలలో లాక్ డౌన్ పటిష్టంగా అమలు చేస్తున్నారు. లాక్ డౌన్ అమల్లో ఉన్నప్పటికీ యథేచ్ఛగా రోడ్లపైకి వచ్చే వారిపై కేసులు నమోదు చేస్తున్నారు. కుంటి సాకులు చెప్పిన వారి వాహనాలు పోలీసులు సీజ్ చేస్తున్నారు. అంతేకాదు, సదరు వాహనాలను లాక్ డౌన్ ముగిసిన తర్వాతే ఇస్తామని స్పష్టం చేస్తున్నారు.

తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా మే 12 నుంచి లాక్ డౌన్ అమల్లోకి వచ్చింది. కరోనాను కట్టడి చేసేందుకు తెలంగాణకు లాక్ వేసింది కేసీఆర్ సర్కార్. ఉదయం 6 గంటల నుంచి 10 గంటల వరకు నిత్యావసరాల కొనుగోలుకు అనుమతించింది. 10 గంటల నుంచి మరుసటి రోజు ఉదయం 6 గంటల వరకు లాక్ డౌన్ ను అమలు చేస్తున్నారు. లాక్‌డౌన్ ఆంక్షలు ఉన్నా.. అత్యవసర వైద్యం కోసం వెళ్తున్న బాధితులు, వైద్యరంగంలో పనిచేసే వారి వాహనాలకు అనుమతి ఉంటుంది. నిత్యావసర వస్తువుల పాలు, కూరగాయలు, ఆహార సామగ్రి, డెయిరీ ప్రొడక్ట్స్ రవాణాకు అనుమతి ఇచ్చింది ప్రభుత్వం. అయినా, పోలీసులు ముందను జీవో లేకుండా జొమాటో, స్విగ్గి డెలివరీ బాయ్స్ వాహనాలను సైతం సీజ్ చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

సినీ పరిశ్రమకు అండగా తెలంగాణ ప్రభుత్వం : మంత్రి తలసాని

హైదరాబాద్ , మే 22: చలన చిత్ర పరిశ్రమకు తెలంగాణ ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. శనివారం తెలుగు సినీ పరిశ్రమ ప్రతినిధులు మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను వెస్ట్ మారేడ్‌పల్లిలోని ఆయన నివాసంలో కలిసి సమస్యలపై వినతిపత్రం అందజేశారు. కరోనా కారణంగా షూటింగ్‌లు నిలిచిపోయి పరిశ్రమపై ఆధారపడిన కార్మికుల పరిస్థితి దుర్భరంగా తయారైందని, వారిని ప్రభుత్వం తరపున ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. సినీ కార్మికులందరికీ కొవిడ్ వ్యాక్సిన్ అందేలా చూడాలని కోరారు. స్పందించిన మంత్రి మాట్లాడుతూ.. లాక్‌డౌన్ ముగిసిన వెంటనే సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని అన్నారు. కరోనా నియంత్రణ కోసం ప్రభుత్వం లాక్‌డౌన్ అమలు చేసిందని అందరూ సహకరించాలని కోరారు. ప్రతిఒక్కరూ కొవిడ్ నిబంధనలు పాటించాలని సూచించారు. మంత్రిని కలిసిన వారిలో తెలుగు సినీ పరిశ్రమ అధ్యక్షుడు అనిల్ కుమార్, పీఎస్ఎన్, దొర, చిత్రపురి కాలనీ సెక్రెటరీ కాదంబరి కిరణ్ తదితరులు ఉన్నారు.

లాక్‌డౌన్‌ను మరింత పకడ్బందీగా అమలు చేయాలి : డీజీపీ

హైదరాబాద్ , మే 22: నగరంలో లాక్‌డౌన్‌ను మరింత పకడ్బందీగా అమలు చేయాలని డీజీపీ మహేందర్ రెడ్డి పోలీసులకు సూచించారు.

శనివారం ఆయన నగరంలోని పలుచోట్ల లాక్‌డౌన్ అమలు తీరును పరిశీలించారు.

సైబరాబాద్ కమిషనర్ వీసీ సజ్జనార్‌తో కలిసి కూకట్‌పల్లిలోని సౌత్ ఇండియా షాపింగ్ మాల్ వద్ద పోలీసులు ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్‌ను పరిశీలించి సిబ్బందికి సూచనలిచ్చారు. అనవసరంగా రోడ్లపైకి వచ్చే వారిపట్ల కఠినంగా వ్యవహరించాలని సూచించారు. లాక్‌డౌన్ సమయంలో నిబంధనలు అతిక్రమిస్తే కేసులు నవోదు చేయాలన్నారు. లాక్‌డౌన్ నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించి పోలీసులకు సహకరించాలని కోరారు.

భారత వేరియంట్ అనే పేరే కనిపించకూడదు: కేంద్రం

న్యూఢిల్లీ, మే 22: కరోనా సంక్షోభం మహోగ్రంగా కొనసాగుతున్న నేపథ్యంలో ఇటీవల తరచుగా భారత వేరియంట్ అంటూ తీవ్రస్థాయిలో ప్రచారం జరుగుతోంది. ఈ వేరియంట్ ప్రమాదకరమైనది కావడంతో దీనిపై చర్చ కూడా అధికస్థాయిలోనే జరుగుతోంది. అయితే, భారత వేరియంట్ అనే పేరుతో ఇది విపరీతమైన ప్రాచుర్యంలోకి రావడంతో కేంద్ర ప్రభుత్వం అప్రమత్త మైంది. ముఖ్యంగా సోషల్ మీడియాలో అనేక పోస్టులు దర్శనమిస్తుండడం పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఇకపై ఏ సోషల్ మీడియా వేదికలోనూ భారత వేరియంట్ అనే పదం కనిపించడానికి వీల్లేదని ఆదేశాలు జారీ చేసింది. భారత వేరియంట్ అనే పదంతో కూడిన కంటెంట్ ఏ మాధ్యమంలో ఉన్నా తొలగించాల్సిందేనని కేంద్ర ఎలక్ట్రానిక్స్, సమాచార ప్రసార శాఖ స్పష్టం చేసింది.

ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాల్లో భారత వేరియంట్ తీవ్ర స్థాయిలో వ్యాపిస్తోందని తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ విధంగా వ్యాపిస్తున్న కరోనా వైరస్ ను భారత వేరియంట్ అని పేర్కొనడం పూర్తిగా తప్పు అని స్పష్టం చేసింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ కూడా బి.1.617 వేరియంట్ ను భారత వేరియంట్ గా ఎక్కడా పేర్కొనలేదని కేంద్రం వివరించింది. కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ సైతం ఇదే విషయాన్ని గతంలో విడమర్చిందని పేర్కొంది.

మంచిర్యాల జిల్లాలో విషాదం.. ఆకలితో అలమటించి వృద్ధ దంపతులు మృతి

మంచిర్యాల, మే 22: : జిల్లాలోని లక్సెట్టిపేట మండలం పాత కొమ్ముగూడెంలో ఆకలితో అలమటించి వృద్ధ దంపతులు మృతి చెందారు. పట్టించుకునేవారు లేక వారు చనిపోయినట్లు గ్రామస్తులు వెల్లడించారు. ఈ దంపతులకు ముగ్గురు కుమారులు ఉండగా, ఇటీవలే ఓ కుమారుడు చనిపోయాడు. మిగతా ఇద్దరు కుమారులు గ్రామం వదిలి వెళ్లారు. దీంతో ఆ వృద్ధ దంపతుల బాగోగులు చూసేవారే లేకుండా పోయారు. అనారోగ్యంతో మంచాన పడి, ఆకలితో అలమటించి ఆ దంపతులు చనిపోయినట్లు గ్రామస్తులు తెలిపారు. ఇంట్లో నుంచి దుర్వాసన రావడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతులను బియ్యాల రాజయ్య, మల్లమ్మగా పోలీసులు గుర్తించారు. ఘటనాస్థలిని మంచిర్యాల ఏసీపీ అఖిల్ మహాజన్ పరిశీలించారు.

మెడికల్ హబ్‌గా వరంగల్ : మంత్రి సత్యవతి రాథోడ్

హైదరాబాద్ , మే 22: ప్రజల ప్రాణాలే అత్యంత ప్రాధాన్యతగా సీఎం కేసీఆర్ రాష్ట్రంలో వైద్య, ఆరోగ్య సేవలు పటిష్టం చేస్తున్నారని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. ఇందులో భాగంగా వరంగల్ ఎంజీఎం హాస్పిటల్ సందర్శించి, కొవిడ్ రోగులను పరామర్శించి, వరంగల్ సెంట్రల్ జైలును సూపర్ స్పెషాలటీ హాస్పిటల్ గా ఏర్పాటు చేస్తామని ప్రకటించిన సీఎం కేసీఆర్ నిర్ణయం సాహసోపేతమైందన్నారు. అందుకు గాను జిల్లా ప్రజల తరఫున సీఎంకు మంత్రి కృతజ్ఞతలు తెలిపారు.

ఓరుగల్లు వాసులంటే సీఎంకు ప్రత్యేకమైన ప్రేమ ఉందన్నారు. అందుకే హైదరాబాద్ తర్వాత అత్యంత ప్రాధాన్యత వరంగల్ నగరానికి ఇస్తూ అన్ని రంగాల్లో ఈ పట్టణాన్ని హైదరాబాద్ కు ధీటుగా అభివృద్ధి చేసే కృషి చేస్తున్నారన్నారు. సీఎం కేసీఆర్ నిర్ణయంతో వరంగల్ మెడికల్ హబ్‌గా మారనుందన్నారు.

సీఎం కేసీఆర్ ముందు చూపుతో అనేక పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తూ తెలంగాణను అగ్రగామిగా మారుస్తున్నారని తెలిపారు. ప్రజల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన లాక్ డౌన్ నిబంధనలు అందరూ పాటించాలన్నారు. కరోనా వస్తే కంగారు పడాల్సిన అవసరం లేదన్నారు. ప్రభుత్వ దవాఖానల్లో అన్ని రకాల సౌకర్యాలు ఏర్పాటు చేశామన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో సివిల్ సప్లై రికార్డు

హైదరాబాద్ , మే 22: తెలంగాణలో వరి ధాన్యం కొనుగోళ్ల విషయంలో రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ రికార్డు సృష్టించింది. 21 రోజుల్లో 41 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు పౌరసరఫరాల సంస్థ కార్పొరేషన్ చైర్మన్ మారెడ్డి

శ్రీనివాస్ రెడ్డి ప్రకటించారు. 10 రోజుల్లో 21.22 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు.

ఇంత పెద్ద ఎత్తున దేశంలో ధాన్యం పండించిన ఏకైక రాష్ట్రం తెలంగాణ మాత్రమే అని స్పష్టం చేశారు. దాదాపు రూ. 10 వేల కోట్లతో 53 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని తెలిపారు. అత్యధికంగా నిజామాబాద్ జిల్లాలో 6.92 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు పేర్కొన్నారు.

సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు వారం రోజుల్లో ధాన్యం కొనుగోళ్లను పూర్తి చేస్తామన్నారు. కరోనా కష్టకాలంలోనూ ధాన్యం కొనుగోలు చేస్తున్న రాష్ట్రం తెలంగాణ మాత్రమే అని తేల్చిచెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా 7 వేలకు పైగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు.

తమిళనాడులో మే 31 వరకూ లాక్‌డౌన్ పొడిగింపు

చెన్నై, మే 22: కరోనా కట్టడికి విధించిన లాక్‌డౌన్ ను మే 31 వరకూ పొడిగించినట్టు తమిళనాడు ప్రభుత్వం శనివారం వెల్లడించింది. ప్రస్తుత లాక్‌డౌన్ మే 24న ముగియనుండగా కరోనా కేసుల నియంత్రణకు మరో వారం రోజుల పాటు పొడిగించింది. కొవిడ్-19 రోగులకు ఆక్సిజన్ సరఫరాలతో పాటు మెరుగైన వసతులను కల్పిస్తున్నామని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ వెల్లడించారు. ఎమ్మెల్యేలు, మంత్రులతో భేటీ అనంతరం ఆయన లాక్‌డౌన్ పొడిగింపు నిర్ణయాన్ని ప్రకటించారు. ఇక నిత్యావసరాలను తరలించే వాహనాలను లాక్‌డౌన్ సమయంలోనూ అనుమతిస్తారు. ఇక వైద్య సంబంధ కారణాలతో జిల్లాల మధ్య తిరిగే వాహనాలకు ఈ-రిజిస్ట్రేషన్ అవసరం లేదని అధికారులు తెలిపారు.

విద్యుత్ శాఖ ఉద్యోగులను ఆపొద్దు : ట్రాన్స్‌కో సీఎండీ

హైదరాబాద్ , మే 22: లాక్‌డౌన్ అమలవుతున్న నేపథ్యంలో హాస్పిటల్స్, వినియోగదారులకు నిరంతరం విద్యుత్ సరఫరా చేసేందుకు విద్యుత్ శాఖ ఉద్యోగులు, సిబ్బంది 24 గంటలు పని చేస్తున్నారని ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ ప్రభాకర్ రావు పేర్కొన్నారు. నల్లగొండ, హైదరాబాద్‌లో విద్యుత్ శాఖ సిబ్బంది, అధికారులపై పోలీసులు దాడి చేస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని ఆయన తెలిపారు. విద్యుత్ శాఖ సిబ్బంది, అధికారుల వాహనాలను ఆపొద్దు, సీజ్ చేయొద్దని పోలీసు ఉన్నతాధికారులకు ప్రభాకర్ రావు విజ్ఞప్తి చేశారు. తమ డిపార్ట్‌మెంట్ ఐడీ కార్డు, సంబంధిత పాస్ చూపిస్తే వదిలేయాలని కోరారు. తమ శాఖ అధికారులకు, సిబ్బందికి లాక్‌డౌన్ నుంచి మినహాయింపు ఉందని ప్రభాకర్ రావు స్పష్టం చేశారు.

చరిత్రలో నేటినిజం

కరీంనగర్‌లో లాక్‌డౌన్ అమలు పరిస్థితులను ప్రత్యక్షంగా పరిశీలించిన జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు

కరీంనగర్ మే 22 (నేటినిజం ప్రతినిధి): లాక్‌డౌన్ అమలవుతున్న తీరును పరిశీలించడంతోపాటు, సడలింపుల సమయాల్లో ఎదురవుతున్న ఇబ్బందులను ప్రత్యక్ష్యంగా పరిశీలించేందుకు శనివారం నాడు జిల్లా కలెక్టర్ కె శశాంక, పోలీస్ కమిషనర్ విబి కమలాసన్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ వల్లూరి క్రాంతి, నగర మేయర్ వై సునీల్‌రావులతోపాటుగా వివిధ ప్రభుత్వశాఖలకు చెందిన అధికారులు, ప్రజాప్రతినిధులు కరీంనగర్‌లోని పలుప్రాంతాల్లో పర్యటించారు.

ఉదయం 09గంటల నుండి 11:30గంటల వరకు లాక్‌డౌన్ అమలవుతున్న తీరును పరిశీలించడంతోపాటు నిత్యావసర వస్తువులు కొనుగోలు చేసేందుకు సడలింపుల సమయాల్లో బయటకు వస్తున్న జనం, రోడ్లకు అనుకుని వివిధ రకాల వ్యాపారాలను కొనసాగిస్తున్న వారితో ఎదురవుతున్న ఇబ్బందులను గుర్తించి పరిష్కారం కోసం సంబంధిత అధికారులను ఆదేశించారు.

రోడ్లకు అనుకుని కొనసాగుతున్న విక్రయాలను ఇతర ప్రాంతాలకు తరలింపులపై పరిశీలన

వెంకటేశ్వర ఆలయం నుండి ప్రధాన కూరగాయమార్కెట్, గంజ్, టవర్‌సర్కిల్, రాజీవ్‌చౌక్, శనివారం అంగడి, రైతుబజార్, తెలంగాణ అమరవీరులస్తూపం వరకు కాలినడకన పర్యటించారు. సడలింపుల సమయాల్లో రద్దీతీవ్రతను దృష్టిలో ఉంచుకుని, తాత్కాలికంగా రోడ్లకు ఆనుకుని కొనసాగిస్తున్న దుకాణాలను సత్వరమే తొలగించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. అలాగే పాతభవనాల సముదాయంలో కొనసాగుతున్న మటన్,చికెన్ మార్కెట్లను రైతుజజార్‌లో నూతనంగా నిర్మించిన ప్రాంతాలకు తరలించేలా చర్యలు తీసుకోవడం, ప్రధాన కూరగాయల మార్కెట్‌ను ఆనుకుని రోడ్లపై వివిధ రకాల వస్తువులు, వివిధప్రాంతాల నుండి వచ్చి కూరగాయలు విక్రయిస్తున్న వారితో ఆ ప్రాంతం అంతా జనంతో కిక్కిరిసిపోతున్న పరిస్థితులను పరిశీలించి రోడ్లపై కూరగాయలు విక్రయించే వారిని ఇతర ప్రాంతాలకు తరలించి విక్రయాలు జరిపేలా చర్యలు తీసుకున్నట్లయితే ప్రధాన కూరగాయల మార్కెట్‌ప్రాంతాల్లో జనం స్తంభించిపోతుండటంతో ఎదురవుతున్న ఇబ్బందులు తొలగిపోయి రోడ్లు విశాలంగా మారుతాయన్నారు. ఇందుకు సంబంధించిన చర్యలు తీసుకునేందుకు కార్యాచరణ రూపొందించి వెంటనే అమలు చేయాలని మున్సిపల్, మార్కెటింగ్‌శాఖ అధికారులను ఆదేశించారు. మార్కెట్‌లోని వ్యాపారుల వద్దకు వెళ్ళి జనం కూరగాయలు ఎన్నిరోజులకు సరిపడా తీసుకుంటున్నారు? ప్రతిరోజు వస్తున్న వారిసంఖ్య ఎలాఉంది? విక్రయాలు కొనసాగుతున్న తీరును స్వయంగా అడిగి తెలుసుకున్నారు.

మోబైల్ కమాండ్‌కంట్రోల్ వాహనంలో ప్రయాణించి, పరిస్థితుల సమీక్ష

లాక్‌డౌన్ సడలింపుల సమయం ముగిసిన తర్వాత మోబైల్ కమాండ్‌కంట్రోల్ వాహనంలో పైన పేర్కొన్న జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు తెలంగాణతల్లి విగ్రహం, కమాన్, బస్టాండ్, తెలంగాణాచౌక్, కోర్టుచౌరస్తా, మంచిర్యాలచౌరస్తా, ఖార్జానగడ్డ కూడళ్ళ ప్రాంతాలను సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్‌శాఖకు చెందిన మోబైల్ కమాండ్‌కంట్రోల్ వాహనంలో ఏర్పాటు చేయబడిన ఎల్ఇడి స్క్రీన్‌పై నగరంలోని వివిధ ప్రాంతాల్లోని పరిస్థితులను పరిశీలించారు. కమాండ్‌కంట్రోల్ వాహనంలోని సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. కమాండ్‌కంట్రోల్ వాహనానికి అమర్చిఉన్న వివిధరకాల అత్యాధునిక కెమెరాల ద్వారా నలుమూలలా ఉండే పరిస్థితులు నిక్షిప్తంకావడం, దీంతో వేగవంతంగా తీసుకుంటున్న చర్యలను శ్రద్ధాసక్తులతో పరిశీలించారు.

లాక్‌డౌన్ అమలు మరింతకఠినంగా జరుగుతుంది-జిల్లా కలెక్టర్ కె శశాంక

కరోనా వైరస్‌వ్యాప్తి ఉధృతి ప్రభావాన్ని ప్రభావాన్ని దృష్టిలో ప్రభుత్వం అమల్లోకి తీసుకవచ్చిన లాక్‌డౌన్‌ను వివిధ ప్రభుత్వశాఖలకు చెందిన అధికారుల సమన్వయంతో మరింత కఠినంగా అమలు చేయడం జరుగుతుందని కరీంనగర్ జిల్లా కలెక్టర్ కె శశాంక అన్నారు. పకడ్బందీగా లాక్‌డౌన్ చర్యలను పటిష్టంగా అమలుచేసేందుకు రేయింబవళ్ళు అలుపెరుగకుండా, ప్రాణాలనుసైతం ఫణంగాపెట్టి పోలీసులు నిర్వహిస్తున్న విధులను ప్రశంసించారు. ఉదయం 06నుండి10గంటల వరకు సడలింపులు ఉన్న సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వైరస్‌వ్యాప్తి ఉధృతి కొనసాగుతున్నందున ప్రజల ప్రాణాల రక్షణకు ప్రాధాన్యతినిస్తూ ప్రభుత్వ ఆదాయానికి ఇబ్బందులు ఎదురవుతున్నా, తప్పనిసరి పరిస్థితుల్లో లాక్‌డౌన్‌ను అమలుచేస్తోందన్నారు. ప్రజలు సడలింపుల సమయాల్లోనే బయటకు వచ్చి నిత్యావసరవస్తువులను కొనుగోలు చేయాలని, ఆ తర్వాత ఇళ్ళలో ఉండాలని సూచించారు. కరోనా వైరస్‌వ్యాప్తి ఉధృతిని దృష్టిలో ఉంచుకుని వివిధ ప్రభుత్వశాఖలకు చెందిన అధికారులు అందిస్తున్న సేవలకు ప్రజలు తమవంతు సహకారం అందించి, ఈ వైరస్‌వ్యాప్తి ఉధృతి నియంత్రణలో భాగస్వాములుకావాలని కోరారు. నియంత్రణ చర్యలను పాటించడంతోపాటు, అవగాహనలేని ప్రజల్లో చైతన్యాన్ని తీసుకరావాల్సిన భాద్యత ప్రతిపౌరునిపై ఉందన్నారు. ప్రజలు ఎలాంటి లక్షణాలు ఉన్నా నిర్లక్ష్యం చేయకుండా వెంటనే ఆసుపత్రుల్లో పరీక్షలు చేయించుకుని, వైద్యుల సూచనల మేరకు మందులను వాడాలని సూచించారు. ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రితోపాటు, జిల్లాలోని ఇతర ప్రాంతాల్లో గల ప్రభుత్వ ఆసుపత్రుల్లో సౌకర్యాలను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. అత్యవసర విధుల్లో ఉన్న ఉద్యోగులు మాత్రమే విధినిర్వాహణ సమయంలో బయటకు రావాలని, తనిఖీల సందర్భంగా గుర్తింపుకార్డులను చూపాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో అడిషనల్ డిసిపిలు ఎస్ శ్రీనివాస్(ఎల్అండ్ఓ), జి చంద్రమోహన్(పరిపాలన), పి అశోక్(టౌన్ డివిజన్), ఏఎస్‌పి రితిరాజ్, ఏసిపిలు తుల శ్రీనివాసరావు, జి విజయ్‌కుమార్, ఆర్ ప్రకాష్, ఏ రాములు, మార్కెటింగ్‌శాఖ అధికారి పద్మావతి, వ్యవసాయమార్కెట్ ఛైర్మెన్ ఎలుక అనిత, మాజీ మేయర్ సర్దార్ రవీందర్‌సింగ్‌తోపాటు పలువురు పోలీస్ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కమిషనరేట్‌వ్యాప్తంగా కొనసాగిన వాహనాల తనిఖీలు

కరీంనగర్ కమిషనరేట్ వ్యాప్తంగా లాక్‌డౌన్ సడలింపుల సమయం ముగిసిన తర్వాత పోలీసులు వాహనాల తనిఖీలను నిర్వహించారు. సరైన ధృవపత్రాలు చూపని వాహనాలను సీజ్‌చేశారు. కమిషనరేట్‌లోని వివిధ విభాగాలకు చెందిన పోలీసులు బృందాలుగా ఏర్పడి వివిధ ప్రాంతాల్లో వాహనాల తనిఖీలను కొనసాగించారు. లాక్‌డౌన్ సడలింపుల సమయం ముగిసిన ఉదయం 10గంటల తర్వాత మరుసటిరోజు ఉదయం 06గంటల వరకు నిరవధికంగా వాహనాల తనిఖీలు కొనసాగుతాయని కరీంనగర్ పోలీస్ కమిషనర్ విబి కమలాసన్‌రెడ్డి తెలిపారు.

కేరళలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో అగ్నిమాపక ఏర్పాట్ల తనిఖీకి నౌకాదళం సాయం

న్యూఢిల్లీ, మే 22: కేరళ ప్రభుత్వ ఆసుపత్రుల్లో అగ్నిప్రమాదాల నుంచి రక్షించుకునే భద్రత ఏర్పాట్లు సరిగా ఉన్నాయో, లేదో తనిఖీకి చేసి చెప్పాలన్న ఆ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి చేసిన విజ్ఞప్తి మేరకు, దక్షిణ నౌకాదళం ఐదు బృందాలను ఎర్నాకులం జిల్లాల్లోని వివిధ ఆసుపత్రులకు ఈ నెల 14వ తేదీన పంపింది. ప్రాథమిక అంచనాతోపాటు అన్ని జిల్లాల్లో తనిఖీ చేయాల్సిన మొత్తం ఆసుపత్రుల సంఖ్యను పరిగణనలోకి తీసుకున్న తర్వాత, కేరళలోని మిగిలిన 13 జిల్లాల్లోని ఆసుపత్రుల్లో తనిఖీల కోసం మరో 22 బృందాలను ఈ నెల 17వ తేదీన నౌకాదళం పంపింది. కొవిడ్ రోగులకు చికిత్సలు అందిస్తున్న మొత్తం 140 ప్రభుత్వ/ తాలూకా ఆసుపత్రులు, చికిత్స కేంద్రాల్లో 101 చోట్ల తనిఖీ పూర్తయింది. మిగిలిన ఆసుపత్రుల్లో ఈ నెల 30వ తేదీ నాటికి తనిఖీలు పూర్తవుతాయని అంచనా వేస్తున్నారు. కాసరగోడ్, కన్నూర్, కోజికోడ్ జిల్లాల్లోని ఆసుపత్రులకు ఐఎన్ఎస్ జమోరిన్, ఎజిమాలలోని నౌకాదళ అకాడమీ నుంచి; కోయంబత్తూరులో ఉన్న ఐఎన్ఎస్ అగ్రణి నుంచి పాలక్కాడ్ జిల్లాలోని ఆసుపత్రులకు నౌకాదళ బృందాలు తరలివెళ్లాయి.

మొన్న రెమిడిసివిర్.. నేడు ఆనందయ్య మందు..

హైదరాబాద్ , మే 21: ప్రపంచాన్ని అతలాకుతలం చేస్తున్న కరోనా మహమ్మారికి నెల్లూరు జిల్లా కృష్ణపట్నంకు చెందిన అనందయ్య తయారు చేసిన నాటు మందు మంచి ఫలితాలు ఇవ్వడంతో దీనికి డిమాండ్ విపరీతంగా పెరిగింది. దీంతో కొందరు ఆనందయ్య ఆయుర్వేద మందును బ్లాక్ మార్కెట్లో విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. ఒక్కో ప్యాకేట్ కు 3 వేల నుంచి 10 వేల వరకు వసూలు చేస్తున్నట్లు సమాచారం. ప్రజల అవసరాన్ని కొందరు కేటుగాళ్లు క్యాష్ చేసుకుంటున్నారు. క్యూలో పడిగాపులు కాసిన మందు దొరక్కపోవడంతో ప్రజలు బ్లాక్ లో కోనుగోలు చేస్తున్నారని తెలిసింది. కరోనా చికిత్సలో వాడుతున్న రెమిడిసివిర్ కొరతను కొందరు బ్లాక్ మార్కెట్లలో అధిక ధరలకు అమ్ముతున్న సంగతి తెలిసిందే. మూడు వేలు ఖరీదు చేసే రెమిడిసివర్ ఇంజక్షన్లను రూ.30-40 వేలకు బ్లాక్ లో అమ్ముతున్నారు. ఇప్పుడు అనందయ్య మందుకు డిమాండ్ ఏర్పడడంతో కొందరు కేటుగాళ్ల దృష్టి ఈ మందుపై పడింది. కరోనా సమయంలో అక్రమ సంపాదనే ధ్యేయంగా రంగంలో దిగారు. కరోనా బాధితుల కోసం ఆనందయ్య తాను కనిపెట్టిన ఆయుర్వేద మందును ప్రజలకు ఉచితంగా అందిస్తుంటే? ఈ అక్రమార్కులు మాత్రం బ్లాక్ లో వేలకు వేలు వసూలు చేస్తున్నారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన కృష్ణపట్నం ఆనందయ్య కరోనా మందును ఆయుష్ శాఖ బృందం పరిశీలించింది. సీఎం జగన్ ఆదేశాల మేరకు కృష్ణపట్నం వెళ్లిన బృందం మరికొన్ని పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించారు. అప్పటి వరకూ మందు పంపిణీ నిలిపివేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ మందుపై శాస్త్రీయ నిర్ధరణకు కేంద్ర ఆయుర్వేదిక్ పరిశోధన సంస్థకు చెందిన వైద్యుల బృందం కృష్ణపట్నం రానుంది.కృష్ణపట్నం ఆయుర్వేద మందుపై అధ్యయనం చేయాలని ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ఆయుష్ ఇన్ ఛార్జ్ మంత్రి కిరణ్ రిజిజు, ఐసీఎంఆర్ డీజీతో మాట్లాడారు. అధ్యయనం చేసి త్వరగా నివేదిక వచ్చేలా చొరవ తీసుకోవాలని కోరారు. ఆనందయ్య ఇస్తున్న ఆయుర్వేద మందుపై శాస్త్రీయ నిర్ధరణ చేయించాలన్న సీఎం జగన్ ఆదేశాలతో ఆయుష్ కమిషనర్, అధికారులు కృష్ణపట్నంలో పర్యటించారు. స్థానికులతో మాట్లాడారు. ఆనందయ్య మందు తయారుచేస్తున్న వివిధ చెట్ల ఆకులు, పదార్థాలను పరిశీలించారు. తయారీ విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం రాత్రి కలెక్టర్ చక్రధర్‌బాబుతో బృంద సభ్యులు మాట్లాడారు. ఆయుర్వేద మందుకు సంబంధించిన పరీక్షలు కొన్ని పూర్తి కావాల్సి ఉందన్నారు. అప్పటివరకు పంపిణీ నిలిపేయాల్సిందిగా ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. కేంద్ర ఆయుర్వేదిక్ పరిశోధనకు చెందిన వైద్యుల బృందం కూడా సోమవారం కృష్ణపట్నం వస్తుందని వైద్యారోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి అనిల్‌కుమార్ సింఘాల్ తెలిపారు.

కృష్ణపట్నంలో ఆనందయ్య ఆయుర్వేద మందు పంపిణీని ఇవాళ నిలిపివేశారు. ఈ మందుపై ఐసీఎంఆర్?తో కలిసి నివేదిక ఇవ్వాల్సి ఉంది. ఈ మందు తమపై ఎలాంటి ప్రతికూల ప్రభావం చూపలేదని వాడిన వారు ఆయుష్ బృందానికి తెలిపారు. ఈరోజు మందు తయారీ విధానాన్ని ఆనందయ్య ప్రభుత్వానికి చూపించనున్నారు. తదనంతరం దీనిపై ప్రభుత్వం ఒక నిర్ణయాన్ని ప్రకటించే అవకాశం ఉంది. ఈ మందు కోసం వివిధ రాష్ట్రాల నుంచి జనం తండోపతండాలుగా రావటంతో కరోనా వ్యాప్తికి అవకాశం ఉందని అధికారులు అంటున్నారు. ఐసీఎంఆర్ నివేదిక తర్వాతనే మళ్లీ మందు పంపిణీ ఉంటుందని ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. మరోవైపు ఆనందయ్యకు పోలీసులు అదనపు భద్రత కల్పించారు.

దేశవ్యాప్తంగా కరోనా సెకండ్ వేవ్ విలయతాండం చేస్తున్న వేళ నెల్లూరులోని కృష్ణపట్నంలో ఆనందయ్య ఇచ్చే మందు కోసం కొన్ని రోజులుగా జనం బారులు తీరుతున్నారు. దాదాపు 20 రోజులుగా ఆనందయ్య ఈ మందును ఉచితంగా కరోనా రోగులకు అందిస్తున్నారు. శుక్రవారం నుంచి ఈ మందు పంపిణీ చేస్తారంటూ స్థానిక ఎమ్మెల్యే కాకాని గోవర్ధన్ చేసిన ప్రకటనతో నెల్లూరు పరిసర ప్రాంతాల్లోని వేలాది మంది వాహనాల్లో కృష్ణపట్నం తరలివచ్చారు. ఎమ్మెల్యే కాకాణి కార్యక్రమాన్ని ప్రారంభించగా ప్రజలు ఎగబడ్డారు. సుమారు 3 కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. క్యూలైన్ లలో స్వల్ప తోపులాట కూడా జరిగింది. కొందరు అంబులెన్సుల్లో కరోనా రోగులను కృష్ణపట్నానికి తీసుకువచ్చారు. గందరగోళ పరిస్థితుల మధ్య మధ్యాహ్నం నుంచి పంపిణీ నిలిపివేస్తున్నట్లు పోలీసులు ప్రకటించారు. మళ్లీ ఎప్పుడు ఇచ్చే తేదీని తర్వాత ప్రకటిస్తారని చెప్పడంతో ప్రజలు ఆందోళన చేశారు.

ఆకుపసరు అసలు వైద్యమా..? ఓ వైద్యుడి ప్రార్థన

హైదరాబాద్ , మే 21: సైన్సు దేనినీ గుడ్డిగా నమ్మదు. అలాగే మూర్ఖంగా వ్యతిరేకించదు కూడా. ఎవరికైనా కావలసింది అందరూ ఆశించేది. ప్రజలందరం బాగుండడమే. కళ్లల్లోకి పడిన రెండు చుక్కల ఆకుపసరు.. క్షణాల్లో రక్తంలోకి వెళ్లి నిమిషాల్లో ఊపిరితిత్తులలో చేరి గడ్డకట్టిన న్యూమోనియాను మాయం చేసి ఆక్సిజన్ వెళ్లేలా చేసి.. పల్స్ ఆక్సీమీటర్లో పర్సెంటేజీని పెంచడం, మందులకు కాదు మహిమలకే సాధ్యం. మరి కళ్లముందే జరిగింది కదా అనే అమాయకులకు సైంటిఫిక్ ఎక్స్‌ప్లనేషన్ ఒక్కటే. 95% ఉన్న మీ పల్స్ ఆక్సీమీటర్ రీడింగ్ గట్టిగా పదిసార్లు గాలిని పీల్చాక.. 98-99%కు ఎలా వెళుతుందో చూడండి. అలాగే కంట్లో వేసిన ఆకు పసరు మంటకు గట్టిగా గాలిపీలిస్తే బాధ కారణంగా రెస్పిరేటరీ రేటు పెరిగితే కొద్ది నిమిషాల పాటూ ఆక్సిజన్ పర్సెంటేజ్ పెరగొచ్చు. కానీ కొద్ది సేపయ్యాక మళ్లీ పాత ఆక్సిజన్ పర్సెంటేజ్ కే తిరిగిరావచ్చు. అందుకే మందు వేశాక గంట గంటకూ రెండురోజుల పాటూ ఆక్సిజన్ పర్సెంటేజ్‌ని గమనించండి. తగ్గితే మాత్రం భవిష్యత్తులో మీరు సైన్సును మాత్రమే నమ్మండి.

నిన్న ఆకుపసరు కళ్లలోపోయించుకొని ఆక్సిజన్ పెరిగిందని అమాయకంగా ఆనందపడ్డ మనవాళ్లు ఈరోజు మళ్లీ పడిపోయిన ఆక్సిజన్ లెవల్స్ తో ఆయాసపడుతూ క్రొత్తగా కళ్లసమస్యలను కొని తెచ్చుకొన్న హృదయ విదారక వీడియోను క్రింద ఒక్కసారి చూడండి. ఒక్క పేషంటు చెప్పిన కన్ఫెషన్ అందరికీ వర్తింపచేయడం. మనకూ అలాగే నయమవుతుందనుకోవడం అశాస్త్రీయం, అమాయకత్వం. మీకు సులభంగా అర్థమయ్యేందుకు ఓ ఉదాహరణ చెబుతాను."నేనివ్వాళ కళ్లమూసుకొని కారు నడిపాను. ఏ యాక్సిడెంట్ కాలేదు" అని అన్నాడట ఒకడు! ఒకసారి యాక్సిడెంటె కాకపోతే అదృష్టం. రెండోసారి కాకపోతె యాదృచ్ఛికం. వందోసారీ కాకపోతే మాత్రమే అది అద్భుతం. ఇందులోనూ ఎన్నో ఇఫ్స్ అండ్ బట్స్ ఉంటాయి. మీరస్సలు ట్రాఫిక్కేలేని రాత్రి రెండుగంటల సమయంలో కారు నడిపుండొచ్చు. అక్కడ రోడ్డు అతి స్ట్రెయిట్‌గా ఉండి ఉండొచ్చు. మీ ప్రక్కసీట్లో మిమ్మల్ని హెచ్చరించే నావిగేటర్ ఉండి ఉండొచ్చు. చివరగామీరు ఎలాన్ మస్క్ ఆటోడ్రైవింగ్ కారును సరదాగా నడుపుతూండొచ్చు.

శాస్త్రీయత అంటే కంటికి కనిపించిన విషయాన్ని వేర్వేరు ఆర్థిక, రోగతీవ్రతలున్న వలంటీర్లమీద వేలసార్లు వేర్వేరుపరిస్థితులలో వేర్వేరు ప్రాంతాలలో స్టడీ చెయ్యడానికి ముందే పక్కాగా రికార్డులలో నమోదు చేసుకొని ఆపైన మందుఇచ్చి వ్యాధి తీవ్రతను సైడ్ ఎఫెక్టులను పరీక్షించి బయటపడ్డ లేదా చనిపోయిన రోగుల సమాచారాన్నినిస్పాక్షికంగా విశ్లేషించి డబుల్ బ్లైండెడ్ కంట్రోల్ స్టడీ చేసి అప్పుడు? అప్పుడు..

ఇది సత్యమని ఈ మందు నిజంగానే పనిచేస్తుందని ప్రపంచానికి ప్రకటించి అందరికీ అందుబాటులోకి తేవడం. అంతేకానీ అర్థంలేని ఆవేశంతో ఏపుట్టలో ఏపాముందో అన్న మూర్ఖపు వాదనతో మన భారతీయ మూలాలమీ దున్న అంతులేని అభిమానంతో ఇలా అన్ని ఆకుపసర్లను సంజీవనీ మూలికలని భ్రమపడి మన ఆత్మీయులను మనమే ఎక్సపెరిమెంట్ యానిమల్స్‌గా మార్చివేస్తే? ఒక్కోసారి అది పెను ప్రమాదాలకు కూడా దారితీసే అవకాశంవుంది. ఇప్పటికీ నర్సులు డాక్టర్లందరూ అహోరాత్రాలూ కరోనాతో మనకోసం పోరాడుతూనేఉన్నారు. కేవలం వాళ్ల పోరాట ఫలితంగానే పాశ్చాత్య దేశాలతో పోలిస్తే అతి తక్కువ వైద్య సదుపాయాలున్న మనదేశంలోనూ మరణాలశాతం వాళ్లకన్నా తక్కువుందన్నది ఒప్పుకుతీరాల్సిన నిజం.

వంద మందికి కరోనా సోకితే 85 మంది. సింపుల్ మందులతో ఇంట్లోనే బాగవుతున్నారు. హాస్పిటల్స్‌లో చేరిన 15 మందిలో 13 మందులు ఆక్సిజన్ డాక్టర్ల సాయంతో క్షేమంగా ఇంటికి తిరిగొస్తున్నారు. ఇవన్నీ కృతజ్ఞతలేకుండా మరిచిపోయి అతి అడ్వాన్స్‌డ్ మెడికల్ ఫెసిలిటీసున్న దేశాలలోకూడా జరుగుతున్న కేవలం రెండు పర్సెంట్ మరణాలను బాధ్యతన్నది లేకుండా టీవీల్లో పేపర్లలో సోషల్ మీడియాల్లో ఎలా హైలైట్ చేస్తారు. ఇప్పటికీ మనమందరం ఓపన్ మైండ్‌తోనే ఉందాం! కరోనాను కంట్రోల్‌చేసే ప్రతీ చిన్నవిషయాన్నీ

ఉపేక్షంచకుండా పరిశోదిద్దాం! ఇలా వేలంవెర్రిగా ఆకుపసర్లను పంచకుండా ప్రభుత్వ అనుమతితో ప్రభుత్వ హాస్పటల్స్‌లో స్వచ్ఛందంగా ముందుకొచ్చే ఐసియుల్లో ఆక్సిజన్ మీదవున్న పేషంట్లమీద అవే ఆకుపసర్లమీద యుద్ధప్రాతిపదికన ఒక శాస్త్రీయ పరిశోధన డబుల్ బ్లైండెడ్ కంట్రోల్ తరహాలో చేద్దాం. పరిశోధనా ఫలితాలను విశ్లేషించి..మందు నిజంగా పనిచేసేదయితే అందరికీ అందుబాటులోకితెద్దాం. మనవాళ్లని మనం కాపాడుకొందాం! అంతేకానీ, అశాస్త్రీయమైన ప్రమాదకరమైన పోకడలను అంగీకరించమని నిర్ద్వందంగా చెబుదాం. ఆర్థిక లాభాపేక్ష లేకున్నాపేరు ప్రఖ్యాతుల కోసం భవిష్యత్తులో స్వలాభం కోసం చేసే అశాస్త్రీయ విధానాలను వ్యతిరేకిద్దాం. అలాగే వాటివలన లాభముందని పరిశోధనల్లో తేలితే మనమందరం మన స్ఫూర్తిగా మ్రొక్కి మరీ ఆహ్వానిద్దాం.. అంతవరకూ రాజకీయ నాయకులు,పాత్రికేయమిత్రులు స్వీయ సంయమనం పాటించి ప్రజలకు అవగాహన కలిగించాల్సిందిగా అపోహలను దూరం చెయ్యాల్సిందిగా మనసారా విజ్ఞప్తి చేద్దాం. చివరగా ఓ చిన్నమాట, మానవ జాతి మనుగడనే ప్రశ్నించి మనల్ని భూమిపైనుండి నమూలంగా తుడిచిపెట్టేందుకు ప్రయత్నించిన కరోనా కన్నా ప్రమాదకరమైన శత్రువులైన ప్లేగు,స్మాల్ పాక్స్,పోలియో స్పానిష్ ఫ్లూలతో పోరాడి తరిమికొట్టి మానవజాతిని కాపాడింది.

"ఆధునిక వైద్యవిధానమే తప్ప మీరనుకొనే ఆకు పసర్లు కావు!" మన భారతీయమూలాలను సగర్వంగా మనం గౌరవిద్దాం. మనకోసం ప్రాణాలర్పించిన ప్రాణాలర్పిస్తున్న వైద్యులత్యాగాలను కృతజ్ఞతతో మనం గుర్తిద్దాం. మనవాళ్లను కాపాడుకోవాలని మనం చేసే ప్రయత్నాలలో వాళ్లకే ప్రమాదమూ కలగకుండా శాస్త్రీయ దృక్పథంతో ఆలోచిద్దాం అంటూ డాక్టర్ గోపికృష్ణ విజ్ఞప్తి చేశారు.

సువేందు తండ్రి శిశిర్ అధికారికి వై ప్లస్ భద్రత

న్యూఢిల్లీ, మే 22: బెంగాల్ బీజేపీ శాసనసభా నేత సువేందు అధికారి తండ్రి, బెంగాల్ ఎంపీ శిశిర్ అధికారికి కేంద్ర ప్రభుత్వం వై ప్లస్ భద్రతను కల్పించింది. శిశిర్ అధికారితో పాటు ఆయన మరో తనయుడు దివ్యేందు అధికారికీ వై ప్లస్ భద్రతను ఇవ్వనుంది. అందులో భాగంగా సీఆర్పీఎఫ్ బలగాలు వారికి అంగరక్షకులుగా ఉంటారు.పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా తృణమూల్ కాంగ్రెస్ రాజీనామా చేసి బీజేపీలో చేరారు. తర్వాత శిశిర్ అధికారి కూడా బీజేపీలో చేరారు. తృణమూల్ లో తనకు మమత గౌరవం ఇవ్వలేదని ఆరోపించారు. అంతేకాదు ఎన్నికల ప్రచారం సందర్భంగా నందిగ్రామ్ నుంచి తనపై పోటీ చేసి గెలవాలని మమతకు సువేందు సవాల్ చేశారు. హోరాహోరీగా సాగిన నందిగ్రామ్ ఎన్నికల్లో సువేందు విజయం సాధించారు. దీంతో ఆయన్ను బీజేపీ శాసనసభా నేతగా ఎన్నికైయ్యారు. కాగా, బెంగాల్ ఎన్నికల్లో బీజేపీ 77 స్థానాల్లో విజయం సాధించిన సంగతి తెలిసిందే.

నర్సీపట్నం డాక్టర్ సుధాకర్ ఆకస్మిక మృతి

అమరావతి, మే 22: నర్సీంపట్నం వైద్యుడు డాక్టర్ సుధాకర్ (52) గుండెపోటుతో నిన్న మృతి చెందారు. గతేడాది కరోనా రోగులకు సేవలు అందించిన మత్తు వైద్య నిపుణుడు డాక్టర్ సుధాకర్.. ఆసుపత్రిలో కనీస సౌకర్యాలు లేవని, ప్రభుత్వాధికారులు ఎవరూ తమకు సహకరించడం లేదని తీవ్ర విమర్శలు చేశారు. ఆసుపత్రిలో గ్లౌజ్‌లు, మాస్కులు ఇవ్వలేదని ప్రభుత్వంపై తీవ్ర విమర్శలకు దిగుతూ మీడియాలో హల్ చల్ చేశారు. దీంతో ప్రభుత్వం సుధాకర్ ను విధుల నుంచి సస్పెండ్ చేసింది.

నడిరోడ్డుపై పోలీసులు ఆయనను చిత్రహింసలకు గురిచేసిన వీడియోలు అప్పట్లో వైరల్ అయ్యాయి. సుధాకర్ మానసిక స్థితి బాగాలేదంటూ విశాఖపట్టణంలోని మానసిక ఆసుపత్రిలో చికిత్స అందించారు. దీంతో సుధాకర్ కుటుంబ సభ్యులు హైకోర్టును ఆశ్రయించారు. మస్కులు అడిగినందుకు డా.సుధాకర్ ను పిచ్చివాడిగా ముద్ర వేస్తోందని కుటుంబీకులు ఆరోపించారు. అయితే, కోర్టు ఈ కేసును సీబీఐకి అప్పగించింది. త్వరలోనే ఈ కేసులో తీర్పు రావాల్సి ఉండగా అంతలోనే ఆయన మరణించారు. కాగా, సుధాకర్‌ను సస్పెండ్ చేసిన ప్రభుత్వం ఇప్పటి వరకు ఆయనను తిరిగి విధుల్లోకి తీసుకోలేదు. దీంతో ఆయన తీవ్ర మనోవేదనకు గురైనట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.

మరోవైపు డాక్టర్ సుధాకర్ మృతి పట్ల టీడీపీ జాతీయ ప్రధాన కార్యాదర్శి నారా లోకేష్ ట్విట్టర్ వేదికగా స్పందించారు. డాక్టర్ సుధాకర్ గారి మృతి నన్ను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని అన్నారు. మాస్క్ అడగడమే దళిత వైద్యుడు చేసిన నేరంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆదేశాలతో రెక్కలు విరిచి కట్టి, కొట్టి, నానా హింసలు పెట్టి పిచ్చాసుపత్రిలో చేర్పించడంతో సుధాకర్ బాగా కుంగిపోయారని పేర్కొన్నారు. ఒక సామాన్య వైద్యుడిని వెంటాడి వేధించి చివరికి ఇలా అంతమొందించారని ఆరోపించారు. "ఇది గుండెపోటు కాదు. ప్రశ్నించినందుకు ప్రభుత్వం చేసిన హత్య ఇది. నిరంకుశ సర్కారుపై పోరాడిన సుధాకర్ గారికి నివాళి అర్పిస్తున్నాను. ఆయన కుటుంబసభ్యులకు నా ప్రగాఢ సంతాపం తెలియజేస్తున్నాను." అని తీవ్రంగా లోకేష్ ట్వీట్ చేశారు.

దేశవ్యాప్త "ఆయుష్- కోవిడ్-19 సలహా... సహాయ కేంద్రం" ప్రారంభం

న్యూఢిల్లీ, మే 22: కోవిడ్-19 ఫలితంగా తలెత్తిన సవాళ్లపై అనుసరించాల్సిన 'ఆయుష్' ఆధారిత పద్ధతులు, పరిష్కారాలతో సామాజిక మద్దతు అందించేందుకు కేంద్ర 'ఆయుష్' మంత్రిత్వశాఖ ఉచిత కాల్స్ చేసేందుకు వీలుగా నం.14443తో ప్రత్యేక సలహా...సహాయ కేంద్రాన్ని ప్రారంభించింది. ఈ కేంద్రం వారంలో ఏడు రోజులూ ఉదయం 6:00 గంటల నుంచి అర్ధరాత్రి 12:00 గంటలదాకా దేశవ్యాప్తంగా సలహా.. సంప్రదింపు సేవలందిస్తుంది.

ఆయుష్ శాఖ పరిధిలోని ఆయుర్వేద, యోగా, యునానీ, సిద్ధ, హోమియోపతి వైద్య విధానాలకు చెందిన నిపుణులు ఈ 14443 నంబరుద్వారా ప్రజల ప్రశ్నలు, సందేహాలకు సమాధానాలిస్తారు. వీరు రోగులకు సలహాలివ్వడంతోపాటు అ

నిజామాబాద్ జిల్లాలో బ్లాక్ ఫంగస్ కలకలం

నిజామాబాద్, మే 22: తెలంగాణలో బ్లాక్ ఫంగస్ అజలడి రేపుతోంది. తాజాగా నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో బ్లాక్ ఫంగస్ కలకలం రేపింది. ఐదుగురికి బ్లాక్ ఫంగస్ లక్షణాలు కనిపించాయి. ఆలూరు, అంకాపూర్, మగ్గిడి, చేపూర్‌కు చెందిన ఐదుగురికి లక్షణాలు కనిపించాయి. బాధితులను చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. కాగా, జిల్లాలో ఇప్పటికే పలువురు బ్లాక్ ఫంగస్ బారిన పడి మృతి చెందారు. కరోనాతోపాటు బ్లాక్ ఫంగస్ విజృంభిస్తుండడంతో జిల్లా వాసులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

మరోవైపు ఉమ్మడి జిల్లాలో లాక్ డౌన్ కొనసాగుతోంది. సీఎం కేసీఆర్ ఆదేశాలతో కలెక్టర్ నారాయణ రెడ్డి రంగంలోకి దిగారు. లాక్‌డౌన్ మినహాయింపు సమయంలో ప్రజల రద్దీని కలెక్టర్ స్వయంగా పరిశీలిస్తున్నారు. జిల్లా కేంద్రం లో కలెక్టర్ నారాయణ రెడ్డి, పోలీస్ కమిషనర్ కార్తికేయ పర్యటించారు. ఇవాళ్టి నుంచి మరింత కఠినంగా లాక్ డౌన్ అమలుకు ఆదేశాలు జారీ చేశారు. పాస్ లేకుండా రోడ్లపైకి వచ్చే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఉక్కు సంకల్పానికి వంద రోజులు.. కార్మికుల వినూత్న నిరసనలు

అమరావతి, మే 22: విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయానికి వ్యతిరేకంగా ప్రారంభమైన ఉద్యమానికి నేటితో వంద రోజులు పూర్తి అయ్యింది. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ చేయాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా కార్మికులు దీక్షలు చేస్తున్నారు. ఉక్కు పోరాటానికి వంద రోజులు పూర్తయిన సందర్భంగా కూర్మన్నపాలెం గెట్ వద్ద ఇవాళ కార్మికుల వినూత్న నిరసన చేస్తున్నారు. వంద అడుగుల బ్యానర్, వంద జెండాలతో కార్మికులు ఆందోళన చేస్తున్నారు.

విశాఖ పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో గడిచిన 100 రోజులుగా నిరసన కార్యక్రమాలు జరుగుతున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో కూడా నిరసన కార్యక్రమం జరుగుతోంది. స్టీల్ ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని విశాఖ పరిరక్షణ పోరాట కమిటీ డిమాండ్ చేస్తోంది. కేంద్రం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకునే వరకు పోరాటం ఆగదని స్పష్టం చేస్తోంది.

కాగా, నష్టాల పేరుతో ప్రైవేట్ పరం చేయాలనుకున్న విశాఖ స్టీల్ ప్లాంట్ ఇప్పుడు ఎంతో మందికి ఊపిరి అందిస్తోంది. కరోనా సెకండ్ వేవ్ లో ఎంతో మందికి ప్రాణ దానం చేస్తోంది. తెలుగు రాష్ట్రాలతో దేశ వ్యాప్తంగా ఆక్సిజన్ ను విశాఖ స్టీల్ ప్లాంట్ నుంచే సరఫరా చేస్తున్నారు. కరోనా రోగులకు ఎంతో అవసరమైన, వారి ప్రాణాలను కాపాడే లిక్విడ్ మెడికల్ ఆక్సిజన్ ను తయారు చేస్తోంది.

కోవిడ్ -19 బాధితుల చికిత్సలో మెడికల్ ఆక్సిజన్ చాలా కీలకంగా మారింది. కరోనా బాధితులను కాపాడటంలో కీలకమైన మెడికల్ ఆక్సిజన్ ఉత్పత్తిలో గతేడాది కూడా స్టీల్ ప్లాంట్ కీలక పాత్ర పోషించింది. ఇప్పుడు కూడా కోవిడ్ చికిత్స అందిస్తున్న ఆసుపత్రులకు విశాఖ స్టీల్ ప్లాంట్ నుంచే పెద్ద ఎత్తున ఆక్సిజన్ సరఫరా చేస్తున్నారు. గతేడాది స్టీల్ ప్లాంట్ నుంచి తెలుగు రాష్ట్రాలు, ఒడిశాకే ఆక్సిజన్ సిలిండర్లు సరఫరా చేశారు. ఈ ఏడాది దేశవ్యాప్తంగా కరోనా కేసులు వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో మిగతా రాష్ట్రాలకు కూడా ఇక్కడి నుంచి ఆక్సిజన్ సరఫరా అవుతోంది.

కర్ణాటకలో జూన్ 7 వరకు లాక్‌డౌన్.. ఉత్తర్వులు ఇచ్చిన సీఎం

బెంగళూర్,మే 22: రాష్ట్రంలో కొవిడ్ ఉధృతి నేపథ్యంలో కర్ణాటక ప్రభుత్వం మరోమారు లాక్‌డౌన్ పొడిగించింది. వచ్చే 7 వతేదీ వరకు లాక్‌డౌన్ అమలు చేయనున్నట్లు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి బీఎస్ యడియూరప్ప వెల్లడించారు. శుక్రవారం సాయంత్రం కేబినెట్ మంత్రులు, సీనియర్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకుకున్నట్లు తెలిపారు.

మే 24 వరకు రాష్ట్రంలో లాక్‌డౌన్ అమలులో ఉండగా నిపుణుల సూచనల మేరకు పొడిగించినట్లు సీఎం మీడియాకు వెల్లడించారు. "ఉదయం 10 గంటల తరువాత కూడా కొంతమంది బయట తిరుగుతూ ఇబ్బందులు తెచ్చిపెడుతున్నారు. లాక్‌డౌన్ నిబంధనలను కఠినంగా అమలు చేయాలి. అనవసరంగా బయట తిరిగే వారిపై కఠినంగా వ్యవహరించాలి' అని పోలీసులను సీఎం యడియూరప్ప ఆదేశించారు.

బ్లాక్ ఫంగస్ బారినపడిన వారికి ప్రభుత్వమే జిల్లా ప్రభుత్వ దవాఖానల్లో ఉచితంగా వైద్యం అందిస్తుందని ఆయన తెలిపారు. కొవిడ్ విజృంభణ నేపథ్యంలో కర్ణాటక ప్రభుత్వం రాష్ట్రంలో మే 10 నుంచి పూర్తిస్థాయి లాక్‌డౌన్ విధించిన విషయం తెలిసిందే. ఉదయం 6 గంటల నుంచి 10 గంటల వరకు నిత్యావసరాల కొనుగోలుకు మినహాయింపు నిచ్చింది. అత్యవసర సర్వీసులతోపాటు వ్యాక్సినేషన్ కోసం వెళ్లే వారికి మినహాయింపు ఉంది. ఇప్పటికే కర్ణాటక రాష్ట్రంలో మొత్తం కొవిడ్ పాజిటివ్ కేసులు 5.3 లక్షలకు చేరాయి.

కరోనా ఎఫెక్ట్.. టైప్‌రైటింగ్ పరీక్షలు వాయిదా

హైదరాబాద్, మే 22: కరోనా నేపథ్యంలో మరో పరీక్ష వాయిదా పడింది. ఇప్పటికే ఇంటర్ సెకండియర్ పరీక్షలను వాయిదా వేసిన ప్రభుత్వం.. తాజాగా టైప్ రైటింగ్, షార్ట్‌హ్యాండ్ పరీక్షలను పోస్ట్‌పోన్ చేసింది. షెడ్యూల్ ప్రకారం జూన్ 26, 27న టైప్ రైటింగ్, జూలై 3, 4న షార్ట్‌హ్యాండ్ పరీక్షలు జరగాల్సి ఉన్నాయి. అయితే లాక్‌డౌన్ వల్ల ఈ పరీక్షలను జూలై 17, 18, 24, 25న నిర్వహించనున్నట్లు అధికారులు ప్రకటించారు.

కోవిడ్ 19 రెండవ దశను పరిగణనలోకి తీసుకుని బలహీనవర్గాలకు ఉనికిలో ఉన్న సౌకర్యాలను సమీక్షించవలసిందిగా రాష్ట్రాలకు/ కేంద్రపాలిత ప్రాంతాలకు సూచనలు

న్యూఢిల్లీ, మే 22: (పిఐబి)ః షెడ్యూల్డు కులాలు/ షెడ్యూల్డ్ తెగలు, సీనియర్ సిటిజెన్లు, పిల్లలు, మహిళలు సహా సమాజంలోని బలహీన వర్గాలపై జరిగే నేరాలను, అత్యాచారాలను నిరోధించడమే కాక, మానవ అక్రమరవాణాను ఎదుర్కోవడానికి, నిరోధించడానికి వ్యవస్థాగత యంత్రాంగాలను క్రమబద్ధీకరించడానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతను ఇస్తోంది.

కోవిడ్ -19 మహమ్మారి రెండవ దశ ప్రభావాన్ని- ముఖ్యంగా బలహీనవర్గాలపై పడుతున్న ప్రభావాన్ని పరిగణనలోకి తీసుకుని కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ బలహీనవర్గాలు, ముఖ్యంగా కోవిడ్ -19 కారణంగా తల్లిదండ్రులను కోల్పోయిన కారణంగా అనాథలైన పిల్లలపై దృష్టి పెట్టవలసిందిగా రాష్ట్రాలకు, కేంద్రపాలిత ప్రాంతాలకు నొక్కి చెప్పింది. ప్రభుత్వ సహాయ సౌకర్యాలను అందుకోవడానికి మార్గదర్శనం అవసరం అయిన బలహీనవర్గాలు, ముఖ్యంగా అనాథలు అయిన పిల్లలు, సహాయం, మద్దతు (వైద్యపరమైన, సంరక్షణ, భద్రత) అవసరమైన సీనియర్ సిటిజెన్లు, షెడ్యూల్డు కులాలు/ షెడ్యూల్డు తెగలకు సంబంధించి ప్రస్తుతం ఉనికిలో ఉన్న సౌకర్యాలను తక్షణమే సమీక్షించవలసిందిగా రాష్ట్రాలను/ కేంద్రపాలిత ప్రాంతాలను హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ కోరింది.

పోలీసు సిబ్బందిని సంవేదీకరణం (సెన్సిటైజేషన్) చేయడం, సంబంధిత వివిధ లైన్ డిపార్ట్‌మెంట్లు/ ఏజెన్సీల సహకారంతో పోలీసు స్టేషన్లలో, జిల్లాలలో అక్రమ మానవ రవాణా (యాంటీ -హ్యూమన్ ట్రాఫికింగ్)యూనిట్లలో మహిళా హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేయవలసిందిగా హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ రాష్ట్రాలను/ కేంద్ర పాలిత ప్రాంతాలకు విజ్ఞప్తి చేసింది.

ఈ కార్యకలాపంలో సౌలభ్యత కల్పించేందుకు పోలీసులు అంతర్ రాష్ట్ర సమాచారాన్ని పంచుకునేందుకు క్రైమ్ మల్టీ సెంటర్ ఏజెన్సీ (అతీతి-ఓంఅ); కనిపించకుండా పోయిన వ్యక్తులు, దొరికిన వ్యక్తుల గురించి పోలీసులకు తెలియచేసేందుకు ఆన్‌లైన్ నేషనల్ అలెర్ట్ సర్వీస్; క్రైం అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్ వర్క్ అండ్ సిస్టంస్ (సిసిటి ఎన్ఎస్); తప్పిపోయిన వ్యక్తులు, గుర్తించని మృతదేహాల ఫోటోలను సిసిటిఎన్ ఎస్‌లో పొందుపరిచిన జాతీయ ఇమేజ్ రిపోజిటరీ (భాండాగారం)లో వెతికేందుకు, పోల్చేందుకు పోలీసు సిబ్బందిని సాధికారం చేసే మెషీన్ లెర్నింగ్ మోడల్‌ను ఉపయోగించే యాంత్రికంగా ఫోటోలను పోల్చగల వెబ్ ఆధారిత అప్లికేషన్ యుఎన్ఐఫ్‌వై (యూనిఫై) సహా పలు పరికరాలను ఎన్‌సిఆర్‌బి రాష్ట్రాలకు/ కేంద్రపాలిత ప్రాంతాలకు విడుదల చేసింది. ప్రస్తుతం ఆన్‌లైన్‌లో తప్పిపోయిన వ్యక్తులను వెతికేందుకు అందుబాటులో ఉన్న సెంట్రల్ సిటిజెన్ సర్వీస్ గురించి మరింత చైతన్యాన్ని సృష్టించవలసిందిగా రాష్ట్రాలను/ కేంద్రపాలిత ప్రాంతాలను హోం మంత్రిత్వ శాఖ కోరింది. కోవిడ్-19 సందర్భంగా ట్రాన్స్‌జెండర్ల భద్రతల కోసం ఇటీవలే విడుదల చేసిన ప్రామాణిక నిర్వహణా విధానాలను గురించి కూడా ఎంహెచ్ ఎ ప్రస్తావించింది.

పౌరుల లబ్దికోసం రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలూ ఈ సౌకర్యాలను ఉపయోగిస్తున్నాయి.

బ్లాక్ ఫంగస్‌పై ముందస్తు జాగ్రత్తలు అవసరం

న్యూఢిల్లీ, మే 22: బ్లాక్ ఫంగస్ గా పేర్కొంటున్నమ్యూకోర్ మైకోసిస్ ఏదో కొత్త వ్యాధి కాదు. కోవిడ్ వైరస్ మహమ్మారి వ్యాప్తికి ముందు కూడా ఇలాంటి ఇన్ఫెక్షన్లు, వ్యాధులు సోకాయి. అయితే, అప్పట్లో వాటి తీవ్రత చాలా తక్కువగా ఉండేది. ఇపుడు మాత్రం కోవిడ్-19 వైరస్ కారణంగా, ప్రాణాంతకమైన ఈ బ్లాక్ ఫంగస్ కేసులు పెద్దసంఖ్యలో నమోదవుతూ వస్తున్నాయి. కరోనా వైరస్ తో సంబంధం ఉన్న ఈ మ్యూకోర్ మైకోసిస్ (సి.ఎ.ఎం.) కరోనానుంచి కోలుకుంటున్న వారిలో, లేదా ఇప్పటికే కోలుకున్న రోగుల్లో కనిపిస్తోంది. ఈ రుగ్మతనుంచి మనల్ని, లేదా మనవాళ్లను రక్షించుకోవడానికి మనం ఏంచేయగలమో ఇపుడు తెలుసుకుందాం. దీనిపై ఇదివరకే పంపించిన సమాచారం ప్రాతిపదికగా ముందుకు వెడదాం. మరిన్ని విషయాలు పరిశీలిద్దాం.

బ్లాంక్ ఫంగస్ కేసులు పెరుగుతున్న విషయాన్ని అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ (ఎయిమ్స్) డైరెక్టర్ అయిన డాక్టర్ రణదీప్ గులేరియా గత వారం ఒక విలేకరుల సమావేశంలో వివరించారు. "గతంలో మధుమేహంతో బాధపడే వారిలో మాత్రమే మ్యూకోర్ మైకోసిస్ సాధారణంగా కనిపించేది. ఎవరికైనా రక్తంలో చక్కెర (గ్లూకోజ్) స్థాయి అసాధారణంగా పెరిగినపుడు ఇది కనిపించేది. కీమో థెరపీ చికిత్స పొందే క్యాన్సర్ రోగులకు, అవయవ మార్పిడి జరిగిన వారికి, వ్యాధి నిరోధక శక్తిని దెబ్బతీసే స్థాయిలో పలు రకాల మందులు వాడేవారికి ఈ వ్యాధి సాధారణంగా సోకేది. అయితే, ఇపుడు కోవిడ్-19 ఇన్ఫెక్షన్, దానికి చేసే చికిత్సా విధానం నేపథ్యంలో కూడా ఇలాంటి కేసులు పెరగడాన్ని గమనిస్తున్నాం. ఎయిమ్స్ ఆసుపత్రిలోనే 20కి పైగా ఇలాంటి కేసులు కనిపించాయి. ఇవన్నీ కోవిడ్ పాజిటివ్ రోగులకు సంబంధించినవే. చాలా వరకు రాష్ట్రాల్లోని కోవిడ్ రోగుల్లో కూడా 400నుంచి 500వరకూ ఇవే కేసులు వచ్చాయి." అని ఆయన అన్నారు.

కోలుకుంటున్న తర్వాత లేదా కోలుకుంటున్నపుడు కోవిడ్ రోగులకే ఈ వ్యాధి ఎలా సోకుతోంది.?

కోవిడ్ రుగ్మతకు చికిత్సలో వాడే మందుల కారణంగా దేహంలో లింపోసైట్ కణాల సంఖ్య తగ్గే ఆస్కారం ఉంటుంది. మన దేహంలోని మూడు రకాల తెల్లరక్త కణాల్లో లింపోసైట్లు కూడా ఒక భాగం. బ్యాక్టీరియా, వైరస్.ల వంటి వ్యాధికారక అణువుల, పరాన్నజీవుల దాడినుంచి ఈ లింపోసైట్లు మన శరీరానికి రక్షణ కల్పిస్తాయి. ఇలా లింపోసైట్ కణాల సంఖ్య తగ్గడంతో అది లింపోపీనియా అన్న రుగ్మతకు దారి తీస్తుంది. దీనితో ఇది కోవిడ్-19 రోగుల్లో ఫంగస్ ఇన్ఫెక్షన్లకు ఆస్కారం, అవకాశం ఏర్పడుతుంది.

వ్యాధి నిరోధక వ్యవస్థ సక్రమంగా పనిచేయని రోగులకు మ్యూకోర్ మైకోసిస్ వ్యాధి సోకే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. కోవిడ్-19 చికిత్సలో న్యాధి నిరోధక వ్యవస్థ పనితీరును దెబ్బతీసేందుకు ఆస్కారం ఉన్నందున అలాంటి రోగులకే బ్లాంక్ ఫంగస్ రుగ్మత సోకే ఆస్కారం ఎక్కువగా ఉంటోంది.

వ్యాధి, లక్షణాలు:

మ్యూకోర్ మైకోసిస్ వ్యాధి శరీరంలోని ఏ అవయవంపై దాడి చేస్తుందనే అంశం ప్రాతిపదికగా ఆ వ్యాధిని పలు రకాలుగా వర్గీకరించవచ్చు. అది ఏ అవయవంపై దాడి చేసిందనేదాన్ని బట్టి... ఫంగస్ ఇన్ఫెక్షన్ తీరు తెన్నులు, లక్షణాల్లో కూడా పలు వ్యత్యాసాలు ఉంటాయి.

? మెదడు సంబంధమైన మ్యూకోర్ మైకోసిస్: పంగస్ కు సంబంధించిన రేణువులను పీల్చినపుడు ఈ రకమైన ఇన్ఫెక్షన్ సోకుతుంది. ఇది ముక్కు, నేత్ర కుహరం, కంటి చుట్టూ ఉన్న ఎముకల గూడును సోకి, చివరకు మెదడుకు కూడా వ్యాపిస్తుంది. తలనొప్పి, ముక్కు దిబ్బడ, ముక్కు ద్వారా ఆకుపచ్చని ద్రవం స్రవించడం, నాసికా రంధ్రాల్లో నొప్పి, ముక్కులో రక్తస్రావం, ముఖం వాచిపోవడం, ముఖంపై స్పర్శ లోపించడం, చర్మం రంగు మారడం వంటివి ఈ వ్యాధి లక్షణాలు.

-ఊపిరి తిత్తుల మ్యూకోర్ మైకోసిసిస్ :పీల్చబడిన ఫంగస్ రేణువులు శ్వాస వ్యవస్థను చేరిపుడు, అవి ఊపిరి తిత్తులను దెబ్బతీస్తాయి. జ్వరం, ఛాతీ నొప్పి, దగ్గు, దగ్గినపుడు రక్తం పడటం వంటివి ఈ వ్యాధి లక్షణాలుగా పరిగణిస్తున్నారు.

అన్నవాహిక మార్గానికి, చర్మానికి, శరీరంలోని ఇతర అవయవాలకు కూడా ఈ బ్లాక్ ఫంగస్ సోకే అవకాశం ఉంది. అయితే, మెదడు సంబంధమైన మ్యూకోర్ మైకోసిస్ అనేదే ఎక్కువగా సోకే సర్వసాధారణమైన రుగ్మత.

కోవిడ్ రోగులు తీసుకోవలసిన ముందు జాగ్రత్త చర్యలు:

ఇలాంటి పరిస్థితులు ఎదురైనవారు మరింత జాగ్రత్తగా ఉండాలి. వారు తమ ఆరోగ్యాన్ని నిరంతరం పర్యవేక్షించుకుంటూ, ఈ కింద పేర్కొన్న ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది.

మధుమేహం రోగి (అదుపుతప్పిన మధుమేహం) +స్టెరాయిడ్ల వాడకం+కోవిడ్ పాజిటివ్ ? ఇవన్నీ కలసి ఒకచోట ఉన్నపుడు ఇన్ఫెక్షన్ సోకేందుకు అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. అందువల్ల మధుమేహ రోగులు తమ రక్తంలో చక్కెర స్థాయిలను ఎప్పటికప్పుడు పరిచూసుకుంటూ పరీక్షించుకుంటూ ఉండాలి.

స్టెరాయిడ్ మందులను అనుచితంగా, విచక్షణా రహితంగా వాడినా అది ఆరోగ్యపరంగా ఆందోళకరమైన పరిస్థితికి దారి తీస్తుంది. వ్యాధినిరోధక వ్యవస్థను నేరుగా దెబ్బతీస్తుంది.

స్వల్పలక్షణాలు ఉన్న కోవిడ్ పాజిటివ్ రోగులు స్టెరాయిడ్ మందుల వాడకాన్ని తప్పనిసరిగా నివారించాలి. కోవిడ్ కు జరిగే చికిత్సలో స్టెరాయిడ్లను వినియోగించడం ఏ విధంగానూ ప్రయోజనకరం కాదు. మరో వైపు,.. స్టెరాయిడ్ మందులను తీసుకోవడం మ్యూకోర్ మైకోసిస్ వంటి ఇన్ఫెక్షన్లకు దారి తీస్తుంది. దీనివల్ల కోవిడ్ వైరస్ నుంచి రోగి కోలుకున్నా, ఫంగస్ ఇన్ఫెక్షన్ ముప్పు పొంచి ఉంటుంది. అంటే, కోవిడ్ సోకిన వారికి ఆక్సిజన్ స్థాయి సాధారణంగా ఉన్న పక్షంలో, చికిత్సపరంగా సదరు వ్యక్తిని స్వల్పలక్షణాలున్న రోగిగా వర్గీకరించినపుడు అలాంటి వారికి స్టెరాయిడ్ మందుల వాడకాన్ని పూర్తిగా నివారించడమే మంచిది.

స్టెరాయిడ్ మందులు తీసుకునే వారు కూడా రక్తంలో చక్కెర స్థాయిలను ఎప్పటికప్పుడు పరిశీలించుకోవలసి ఉంటుంది. ఎక్కువ సందర్భాల్లో ఎవరైనా మధుమేహంలేనివారు స్టెరాయిడ్లు తీసుకున్న అనంతరం రక్తంలో వారి రక్తంలో చక్కెర స్థాయి 300నుంచి 400కు పెరగడం సాధారణంగా జరుగుతూ ఉంటుంది. అందువల్ల ఎవరకి వారు తమ చక్కెర స్థాయిలను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండటం ఎంతో అవసరం.

''కోవిడ్-19 రోగులు ఎక్కువ మోతాదులో స్టెరాయిడ్ మందులు తీసుకోవడం వల్ల ఏ మాత్రం ఉపయోగం లేదు. చిన్న మోతాదునుంచి ఒక మోస్తరు వరకూ మాత్రమే తీసుకుంటే సరిపోతుంది. మనకు అందుబాటులో ఉన్న సమాచారం మేరకు కోవిడ్ రోగులు 5నుంచి గరిష్టంగా పది రోజులు మాత్రమే స్టెరాయిడ్ మందులు తీసుకోవాలి. పైగా రక్తంలో చక్కెర స్థాయిలను స్టెరాయిడ్లు బాగా పెంచుతాయి. అపుడు చక్కెల స్థాయిని నియంత్రించడం చాలా కష్టమవుతుంది. చివరకు ఫంగస్ ఇన్ఫెక్షన్ కు దారి తీస్తుంది." అని ప్రొఫెసర్ గులేరియా అన్నారు..

మాస్కులు ధరించడం తప్పనిసరి. గాలిలోని ఫంగస్ రేణువులు నాసికా రంధ్రాల ద్వారా చాలా సులభంగా దేహంలోకి చొరబడతాయి. అందువల్లనే ఇన్ఫెక్షన్ ను నివారించాలంటే మాస్కు ధరించడం అత్యంత ఆవశ్యకం. నిర్మాణం కార్యక్రమాలు జరిగే చోట పనిచేసే వారు ఈ విషయంలో ప్రత్యేక జాగ్రత్త తీసుకోవలసి ఉంటుంది.

ఈ ఫంగస్.లు ఎక్కడ ఉంటాయి?

మ్యూకోర్ మైసీట్స్ అనే బూజు వంటి పదార్థాల ద్వారా మ్యూకోర్ మైకోసిస్ సోకుతుంది. ఈ పదార్థాలు సాధారణంగా గాలిలో, నీటిలో చివరకు ఆహారంలో కూడా కలసి ఉంటాయి. గాలిలోనుంచి ఈ ఫంగస్. కణాలు రేణువుల రూపంలో శరీరంలో ప్రవేశిస్తాయి. శరీరంపై కోసిన గాయం, కాలిన గాయం, మరేదైనా గాయం ఉన్నా ఆ ప్రదేశంనుంచి కూడా ఇది లోపలికి ప్రవేశిస్తుంది. ఇన్ఫెక్షన్ ను ముందస్తుగా గుర్తించిన పక్షంలో కంటి చూపు కోల్పోకుండా, భవిష్యత్తులో మెదడుకు ఇన్ఫెక్షన్ సోకకుండా నివారించుకోవచ్చు.

ముందు జాగ్రత్తగా అనుసరించవలసిన ఇతర చర్యలు:

1. గదిలో తేమ కారక వస్తువులను శుభ్రపరచడం (ఇది ఆక్సిజన్ కాన్సంట్రేటర్లను వాడేవారికోసం)

2. సాధారణ స్టైరైల్ సైలైన్ ను మాత్రమే వాడాలి. బాటిల్ ను రోజూ మార్చుతూ ఉండాలి.

3. మాస్కులను రోజు క్రిమి సంహారకాలతో శుభ్రపరుస్తూ ఉండాలి.

స్వల్ప లక్షణాలు కనిపించినా సరే,అలక్ష్యం కూడదు:

తలనొప్పి, కళ్లచుట్టూ, ముక్కు చుట్టూ ఎర్రబారడం, జ్వరం (మామూలు స్వల్ప లక్షణాలు), ఎపిటాక్సిస్ (ముక్కునుంచి రక్తస్రావం), ముక్కు, నాసికా రంధ్రాలు మూసుకుపోవడం, తలనొప్పి, దగ్గు, శ్వాస తగ్గడం, రక్తపు వాంతులు,

మానసిక ఆందోళన, పాక్షికంగా కంటిచూపు మందగించడం...ఇలాంటి లక్షణాలపై ఏ మాత్రం నిర్లక్ష్యం కూడదు.

వైద్యులు, ఇతర ఆరోగ్య కార్యకర్తల బాధ్యతలు

కోవిడ్ నుంచి కోలుకున్న వారిని ఆసుపత్రినుంచి డిశ్చార్జి చేసేటపుడు వైద్యులు అప్రమత్తం చేయాలి.

మ్యూకోర్ మైకోసిస్ ముందస్తు లక్షణాల గురించి వారికి తగిన సూచనలు చేయాలి.; ముఖం వాచిపోవడం, నొప్పి

పుట్టడం, ముక్కు దిబ్బడ, పళ్లు నడలడం, ఛాతీ నొప్పి, శ్వాస సరిపోకపోవడం...వంటి లక్షణాల గురించి వారికి వివరంగా తెలియజేయాలి.

కరోనా దేవి' ఆలయం.. ప్రత్యేక ఏంటో తెలుసా?

తమిళనాడు, మే 22: కరోనా మహమ్మారి ప్రపంచాన్ని కుదిపేస్తోంది. రెండో దశ దేశాన్ని అతలాకుతలం చేస్తోంది. ఈ తరుణంలో కరోనా ఎప్పుడు పోతుందా అని ప్రజలంతా ఎదురుచూస్తున్నారు. కరోనాకి విరుగుడు త్వరగా వస్తే బావుండునని దేవుడిని నమ్మేవారంతా ప్రార్థనలు చేస్తున్నారు. అంతేకాదు ఏకంగా కరోనా దేవికే పూజలు చేస్తున్నారు. అవును మీరు చదివింది కరెక్ట్. కరోనాకి ఓ ఆలయం కట్టి పూజలు చేసి.. అమ్మా కరోనా తల్లీ నీకు పుణ్యం ఉంటుంది.. వెళ్లిపోవమ్మా అని ప్రార్థనలు చేస్తున్నారు. ఏకంగా 'కరోనా దేవి' అని పేరుపెట్టి గుడి కట్టి పూజలు చేస్తున్నారు. కొవిడ్ మహమ్మారి నుంచి ప్రజలను కాపాడాలంటూ తమిళనాడులోని కోయంబ త్తూరు శివారులో 'కరోనా దేవి' ఆలయం నిర్మించారు. 48 రోజుల పాటు ఈ పూజలు చేస్తారు. ఈ విషయాన్ని ఆ ఆలయ నిర్వాహకులు తెలిపారు. కోయంబత్తూరు శివారులోని ఇరుగూరులో కరోనా దేవి ఆలయం ఇటీవల వెలిసింది. గతంలో ప్లేగు వ్యాధి నుంచి అందరూ సురక్షితంగా బయటపడాలని మారియమ్మన్ ఆలయాన్ని నిర్మించారు. కామాక్షిపురి అధినం శక్తిపీఠం శివలింగేశ్వర స్వామిగళ్ ఆధ్వర్యంలో ఈ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. 48 రోజుల పాటు పూజాది కార్యక్రమాలు జరుగుతున్నాయని నిర్వహకులు చెప్పారు.

కామట్చిపురి అధినం ఆధ్వర్యంలో ఈ గుడిని ఏర్పాటు చేశారు. కరోనా దేవికి 1.5 అడుగుల నల్లరాతి విగ్రహం చేయించారు. దీన్ని ఆ మఠం పరిసరాల్లోనే ఏర్పాటు చేశారు. కరోనా దేవికి నిష్టగా 48 రోజుల పాటు ప్రార్థనలు చేస్తే.. ఈ తల్లి కరుణించి వెళ్ళిపోతుందని ఆశిస్తున్నట్టు నిర్వాహకులు అంటున్నారు. కరోనా నుంచి ప్రజలను కాపాడాలని వేడుకుంటూ ఈ ఆలయంలో పూజలు నిర్వహించినట్లు కమాట్చిపురి అధినంకు చెందిన శ్రీ శివలింగేశ్వర స్వామి చెప్పారు. గతంలో కలరా కారణంగా అనేక మంది ప్రాణాలు విడిచారని గుర్తుచేశారు. ఇలాంటి ప్రాణాంతక వ్యాధుల నుంచి రక్షిస్తారనే నమ్మకంతో? మరియమ్మన్, మకాలి అమ్మన్, కరుమరియమ్మన్ దేవతలను పూజించినట్లు పేర్కొన్నారు. ఇదే తరహాలో ప్రస్తుతం మహమ్మారి నుంచి దేశ ప్రజలు బయటపడాలని వేడుకుంటూ 48 రోజుల పాటు పూజలు నిర్వహించినట్లు స్పష్టం చేశారు.

నేపాల్ పార్లమెంట్ రద్దు.. నవంబర్‌లో మధ్యంతర ఎన్నికలు..



నేపాల్ ,మే 22: నేపాల్ పార్లమెంట్‌ను ఆ దేశ అధ్యక్షురాలు విద్యాదేవి భండారి రద్దు చేశారు. ఈ సందర్భంగా మధ్యంతర ఎన్నికల తేదీలను ప్రకటించారు. నవంబర్ 12, 19 తేదీల్లో ఎన్నికలు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారు. ఇటీవల ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన కేపీ శర్మ ఓలీ బలనిరూపణకు వెనక్కి తగ్గగా, రాష్ట్రపతి విద్యాదేవి భండారీ.. ప్రభుత్వ ఏర్పాటుకు ముందుకు రావాల్సిందిగా ఇతర రాజకీయ పార్టీలను కోరారు. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు గడువు ఇచ్చారు. ఈ క్రమంలో తమకు 149 మంది చట్టసభ్యుల మద్దతు ఉందని, ప్రభుత్వ ఏర్పాటుకు అనుమతించాలని విపక్ష కూటమి ముందుకు వచ్చింది. అయితే, విపక్ష అభ్యర్థనను అధ్యక్షురాలు పరిగణలోకి తీసుకోలేదని తెలుస్తోంది.

ప్రభుత్వ ఏర్పాటుకు షేక్ బహదూర్ దేవ్?బా, కేపీ శర్మ ఓలి చేసిన విజ్ఞప్తిని తోసిపుచ్చారు. ఈ మేరకు నేపాల్ అధ్యక్షురాలి కార్యాలయం శుక్రవారం అర్ధరాత్రి ప్రకటన విడుదల చేసింది. రాష్ట్రపతి పార్లమెంట్‌ను రద్దు చేశారని, మొదటి సాధారణ ఎన్నికలు నవంబర్ 12న, రెండో దశ ఎన్నికలు 19న నిర్వహించాలని ఆదేశించినట్లు కార్యాలయం ప్రకటనలో పేర్కొంది. ఇటీవల ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన కేపీ శర్మ ఓలీ బలనిరూపణకు వెనక్కి తగ్గగా, రాష్ట్రపతి విద్యాదేవి భండారీ.. ప్రభుత్వ ఏర్పాటుకు ముందుకు రావాల్సిందిగా ఇతర రాజకీయ పార్టీలను కోరారు. అయితే, విపక్ష అభ్యర్థనను అధ్యక్షురాలు పరిగణలోకి తీసుకోలేదని తెలుస్తోంది. ప్రస్తుతం నేపాల్ కరోనా మహమ్మారి సెకండ్ వేవ్‌తో అల్లాడుతున్నది. రోజుకు సగటున 8వేలకుపైగా పాజిటివ్ కేసులు నమోదవుతున్నాయి.

లాక్ డౌన్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యను -చందుర్తి సీఐ శ్రీలత

రాజన్న సిరిసిల్ల మే, 22(నేటినిజం ప్రతినిధి): లాక్ డౌన్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చందుర్తి సిఐ శ్రీలత అన్నారు, చందుర్తి సర్కిల్ కార్యాలయంలో శనివారం ఆమె మాట్లాడుతూ రుద్రంగి,కోనరావుపేట ,చందుర్తి పోలీస్ స్టేషన్ లలో లాక్ డౌన్ లో మొత్తం 778 కేసులు నమోదు చేసినట్లు సిఐ

అడవులను ఆలింగనం చేసుకున్న చెట్టంత మనిషి..!

(21 మే 2021 రోజున పరమపదించిన 'సుందర్‌లాల్ బహుగుణ'కు అక్షర నివాళి)

భారతదేశం గర్వించదగిన ప్రముఖ పర్యావరణవేత్త, సాంఘీక సేవాతత్పరుడు, చిప్కో ఉద్యమ కర్మయోగి 'రాజేంద్ర సింగ్ సుందర్‌లాల్ బహుగుణ' 09 జనవరి 1927న తెహ్రీ గర్వాల్ సమీపానగల మరోడా గ్రామం, ఉత్తరాఖండ్‌లో జన్మించారు. తన 13వ ఏటనే శ్రీ దేవ్ సుమన్ శిష్యరికంలో అహింస సిద్ధాంతాన్ని ప్రచారం చేశారు. చిన్న వయస్సులోనే 'అంతరానితనం' అనే దురాచారానికి వ్యతిరేకంగా ఉద్యమించారు. 1965 - 70ల మధ్య హిమాలయ పర్వత ప్రాంత మహిళలను ఏకంచేస్తూ 'మద్యపానానికి' వ్యతిరేకంగా గళమెత్తారు. 1947లో వలసపాలనకు వ్యతిరేకంగా ప్రజలను సంఘటితం చేసిన పరమ దేశభక్తుడు, గాంధేయవాది సుందర్‌లాల్ బహుగుణ. ధర్మపత్ని విమలను వివాహమాడి గ్రామంలో ఆశ్రమం ఏర్పరచుకొని ఆదర్శప్రాయ జీవితం గడిపారు. గాంధీ ప్రవచనాలకు ప్రభావితం అయిన బహుగుణ హిమాలయన్ అటవీ ప్రాంతాల్లో 4,700 కిమీ పాదయాత్ర చేసి, మెగా ప్రాజెక్టుల నిర్మాణంతో గ్రామీణ శ్రమైక్య సాంఘీక జీవన సౌందర్య విచ్ఛిన్నాన్ని మరియు పర్యావరణానికి కలిగిన విఘాతాన్ని గుర్తించి ఆకలింపు చేసుకున్నారు. హిమాలయన్ స్వరంగా, చెట్లకు స్నేహితుడిగా, అటవీ జాతుల ఆత్మగౌరవంగా, నీటి నేస్తంగా, లింగ సమానత్వ గళంగా, గ్రామీణ నేల పుత్రుడిగా బహు గుణాల పాత్రల పర్యావరణ బాటసారి సుందర జీవితం అనన్యసామాన్యం, అభినందనీయం. ఆధునిక అభివృద్ధి పేరుతో హరిత వినాశనం, నేల కాలుష్యం మరియు నీటి దోపిడిలను వ్యతిరేకించిన బహుగుణ పర్యావరణ గోసను ఢిల్లీ దాకా వినిపించగలిగారు. బహుగుణ సరళ జీవనశైలి, వస్త్రధారణ, పద్ధతులు, అతి సాధారణ ఆహారపు అలవాట్లు, సుందర వాక్కులు, ఆకర్షణీయ నవ్వుల మేలు కలయిక భారతీయులకు సదా ప్రేరణాత్మకం.

అలకనందా పరివాహక ప్రాంత అడవుల్లోని 2,500 మహావృక్షాలను ప్రభుత్వం వేలం వేయడాన్ని వ్యతిరేకిస్తూ, చెట్లను ఆలింగనం చేసుకుంటూ నరికివేతను ఆపడానికి స్థానిక గౌర దేవి, సందేశా దేవి మరియు బచ్నీ దేవి లాంటి మహిళలను చైతన్య పరిచారు. 26 మార్చి 1974న 'చిప్కో ఉద్యమం' ప్రారంభించి హిమాలయ మరియు యూపీ ప్రాంత అడవులను కాంట్రాక్టర్లు నరికి వేయడానికి వ్యతిరేకంగా గళమెత్తి 'జీవావరణమే శాశ్వత ఆర్థిక వ్యవస్థ (ఎకాలజీ ఈజ్ పర్మనెంట్ ఎకానమీ)' అని నినదించారు. హిందీ పదం 'చిప్కో' అనగా 'ఆలింగనం' అని అర్థం. 1981-83 మధ్య కాలంలో కాశ్మీర్ నుంచి కోహిమా వరకు 5,000 కిమీ గ్రామాల్లో తిరుగుతూ తన ఉద్యమం వైపుకు గ్రామీణులను ఆకర్షించగలిగారు. నాటి ప్రధాని ఇందిరాగాంధీతో జరిగిన సమావేశ ఫలితంగా హిమాలయన్ అడవుల నరికివేతను 15 ఏండ్లు నిషేదించగలిగారు. తన సహచర మిత్రురాలు గౌర దేవితో కలిసి పర్యావరణ పరిరక్షణకు నడుం బిగించారు. తెహ్రీ డ్యామ్ నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ భగీరథి నది ఒడ్డున దశాబ్దాల పాటు నిరాహార దీక్షలు మరియు సత్యాగ్రహాలు నిర్వహిస్తూ తన నిరసనగళాన్ని జాతీయ స్థాయి వరకు వినిపిస్తూ జైలు పాలు కూడా అయ్యారు. 1995లో నిర్వహించిన 45 రోజుల నిరాహార దీక్షను నాటి ప్రధాని పి వి నరసింహారావు హామీతో విరమించారు. తరువాత న్యూఢిల్లీలోని మహాత్మా గాంధీ సమాధి రాజ్ ఘాట్ వద్ద 75 రోజుల దీక్షను ప్రధాని దేవెగౌడ లిఖిత హామీతో విరమించారు. దశాబ్దాల కాలం సుప్రీమ్‌కోర్టులో కేసు నడిచినా ఫలితం రానందున 2001లో ప్రభుత్వం అరెస్టు కూడా చేయడం, డ్యామ్ నిర్మాణం కొనసాగడం జరిగింది. 2004లో తెహ్రీ డ్యామ్ నిర్మాణం పూర్తి కావడం, డ్యామ్ నీటితో నిండటంతో తన నివాసాన్ని 'కోటి' అనబడే ప్రాంతానికి మార్చారు. అనంతరం తన నివాసాన్ని ఉత్తరాఖండ్ రాజధాని డెహ్రాడూన్‌కు మార్చారు.

అమాయక గ్రామీణుల శ్రేయస్సు కోరుతూ పర్యావరణ పరిరక్షణకు తన జీవితాన్ని అంకితం చేసిన సుందర్‌లాల్ బహుగుణ పట్టుదల, ప్రజాహిత నిస్వార్థ సేవలు మరియు ప్రతిభను గుర్తించిన ప్రభుత్వం పద్మశ్రీ (1981లో తిరస్కరించారు), రైట్ లైవ్లీవుడ్ ఆవార్డు, జమ్నాలాల్ బజాజ్ ఆవార్డు, ఐఐటి రూర్కీ గౌరవ డాక్టరేట్ మరియు పద్మ విభూషన్ (2009) పురస్కారాలతో సన్మానించింది. సుందర్‌లాల్ బహుగుణ బహుముఖీన ప్రతిభ ప్రదర్శిస్తూ 'ధర్తీ కీ పుకార్', 'భూ ప్రయోగ్ మే బునియాదీ పరివర్తన్ కీ ఓర్', 'ఎన్విరాన్‌మెంటల్ క్రయసిస్ అండ్ హుమన్స్ ఎట్ రిస్క్' మరియు 'ఇండియాస్ ఎన్విరాన్‌మెంట్' లాంటి పుస్తక రచనలు కూడా చేశారు. 08 మే 2021న కరోనా సోకడంతో ఏఐఐయంయస్, రిషికేష్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తన 94వ ఏట 21 మే 2021న కన్ను మూశారు. భార్య విమల, ఇద్దరు కుమారులు మరియు ఒక కూతురు కలిగిన 'బహుగుణా'ల మేలు కలయికే మన స్వర్గీయ సుందర్ లాల్. అతని మరణం దేశానికి తీరని లోటు, అతని రూపం భవిష్యత్తు తరాలకు స్ఫూర్తిదాయకం. 'ప్రకృతితో సామరస్యమే నికార్సైన జీవన విధానం' అని ప్రగాఢంగా నమ్మిన చెట్టంత మనిషి మన సుందర్ లాల్ బహుగుణ. అటవీ ప్రాంతాల్లో మెగా డ్యామ్‌ల నిర్మాణం మాత్రమే సుస్థిరాభివృద్ధి కాదని నమ్మిన హరిత హితవరి, నీటి సహజ ప్రవాహ సహాయంతో విద్యుత్ ఉత్పత్తి చేయాలని సూచించిన గిరిజ జాతుల గొంతుక మన బహుగుణ. భారతీయ జీవ నదులను, హిమాలయ పర్వత శ్రేణులను, పర్వత ప్రాంత తెగలను కాపాడాలనే మహత్తర లక్ష్యంతో తన జీవితాన్ని దారబోసిన సుందర్‌లాల్ బహుగుణ సదా చిరస్మరణీయుడు, ఆదర్శప్రాయుడు మరియు అనుసరణీయుడు.

- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

కరోనా బాధితులకు నిత్యావసర వస్తువులు అందజేత

మహబూబాబాద్, మే 22: : కరోనా బాధితులకు నిత్యవసర వస్తువులను జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్ శనివారం లెనిన్ నగర్ వడ్డెర కాలనీ లలో నివాసముంటున్న వారి ఇండ్లకు వెళ్లి స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వైద్య సిబ్బంది ఇంటింటికి వస్తున్నారా? ప్రతి ఒక్కరి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుంటున్నారా అని అడిగి తెలుసుకున్నారు.

కరోనా పాజిటివ్ వ్యక్తులు బయటకు రాకుండా వార్డ్ కౌన్సిలర్ చర్యలు తీసుకోవాలని సూచించారు. కరోనా లక్షణాలు ఇబ్బందులు ఉంటే వైద్య సిబ్బందికి తెలియజేయాలన్నారు. కరోనా పాజిటివ్ వ్యక్తులు డాక్టర్ల వద్ద, వైద్య సిబ్బంది వద్ద లక్షణాలు వెల్లడించడం లో ఏమాత్రం సిగ్గు పడొద్దన్నారు. నిర్భయంగా ఉండాలని, ఆహారం తీసుకుంటూ మందులు సక్రమంగా వాడితే నయమవుతుందని కలెక్టర్ తెలిపారు.

కలెక్టర్ వెంట కౌన్సిలర్ మార్నేని వెంకన్న ఉప వైద్యాధికారి అంబరీష, జిల్లా కోవిడ్ నోడల్ అధికారి రాజేష్, తాసిల్దార్ రంజిత్, పరికిపండ్ల అశోక్, టీఎన్జీవో అధ్యక్షుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటాం

వనపర్తి మే 22: : టీఆర్ఎస్ పార్టీ ప్రతి కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటుందని వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. శ్రీరంగాపురం మండలం శేరిపల్లి గ్రామానికి చెందిన టీఆర్ఎస్ కార్యకర్త చటమోని బుచ్చన్న కరెంట్ షాక్ తో మరణించాడు. పార్టీ సభ్యత్వ నమోదు ద్వారా ఇన్సూరెన్స్ కింద వచ్చిన రూ.2 లక్షల చెక్కును బుచ్చన్న సతీమణి పద్మమ్మకు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..టీఆర్ఎస్‌లోనే ప్రతి కార్యకర్తకు సముచిత గౌరవం లభిస్తుందన్నారు. నిస్వార్థంగా పనిచేసే ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు లభిస్తుందన్నారు.

కల్వరి టెంపుల్‌లో వంద ఐసోలేషన్ పడకలు ప్రారంభం

సంగారెడ్డి, మే 22: : జిల్లాలోని కల్వరి టెంపుల్‌లో వంద ఐసోలేషన్ పడకలను ఆర్థిక మంత్రి హరీష్ రావు శనివారం మధ్యాహ్నం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి హరీష్ రావు మాట్లాడుతూ.. 2, 3 రోజుల్లో జహీరాబాద్ ఆస్పత్రికి 500 లీటర్ల ఆక్సిజన్ సరఫరా అవుతుందన్నారు. వ్యాక్సిన్ల కొనుగోలుకు ప్రభుత్వం రూ. 100 కోట్లు చెల్లించిందని తెలిపారు. రాష్ట్రాలకు వ్యాక్సిన్ల పంపిణీని కేంద్రం నిర్ణయిస్తుందని పేర్కొన్నారు. కరోనా కట్టడికి రాష్ట్ర ప్రభుత్వం పకడ్బందీ చర్యలు తీసుకుంటోందని, ప్రజలు కూడా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో కరోనా రోగులకు మెరుగైన వైద్య సదుపాయాలు అందిస్తున్నామని మంత్రి హరీష్ రావు తెలిపారు.

లాక్ డౌన్ విధులలో పోలీస్ వాలంటీర్స్

రాజన్న సిరిసిల్ల మే, 22(నేటినిజం ప్రతినిధి): వేములవాడ టౌన్ పట్టణ పోలీస్ లకు సహాయం గా స్థానిక "యువ ఫౌండేషన్" స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు 15 మంది వాలంటీర్స్ గా లాక్ డౌన్ విధులలో పాల్గొన్నారు.వేములవాడ లో పటిష్ట లాక్ డౌన్ ని అమలు పరుస్తున్నట్టు, అనవసరం గా బయట కు వచ్చిన వారి వాహనాలు సీజ్ చేసి కేసులు నమోదు చేస్తున్నట్టు, ప్రతీ ఒక్కరు పోలీస్ ల నుండి ఎలా తప్పించుకొని తిరగాలి అని అనుకోకుండా కరోనా నియంత్రణ కు ప్రతీ ఒక్కరు సహకరించాలి అని,పట్టణ ఇన్స్పెక్టర్ వెంకటేష్ తెలిపారు.

బాధితులకు భరోసా కల్పించిన సీఎం కేసీఆర్: మంత్రి ఎర్రబెల్లి

వరంగల్, మే 22: : గతంలో ఏ ముఖ్యమంత్రి కూడా ఎంజీఎం దవాఖానను పట్టించుకోలేదని మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. సెంట్రల్ జైలు తరలింపు, సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మాణంపై పెదవి విప్పలేదని విమర్శించారు. దీనికి భిన్నంగా సీఎం కేసీఆర్ స్పందించడమే కాకుండా, స్వయంగా వరంగల్ వచ్చి పరిశీలించడం ఇక్కడి ప్రజల అదృష్టమని చెప్పారు. నిన్న సీఎం కేసీఆర్ వరంగల్ పర్యటన సందర్భంగా తీసుకున్న నిర్ణయాలపై హన్మకొండలో ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్, ఎమ్మెల్యేలతో కలిసి మంత్రి మీడియాతో మాట్లాడారు.

దేశంలో ఇప్పటివరకు ఏ ముఖ్యమంత్రయినా, కేంద్ర మంత్రులైనా కొవిడ్ వార్డుల్లోకి వెళ్లారా అని ప్రశ్నించారు. ఆ పని సీఎం కేసీఆర్ చేశారని, వార్డల్లోకి వెళ్లి బాధితులకు భరోసా కల్పించారని చెప్పారు. కరోనా బాధితులను ఆదుకోవడానికి దాతలు చేస్తున్న సహాయం అభినందనీయమన్నారు. ఎంజీఎంలో కొంత టెక్నీకల్ స్టాఫ్ కొరత ఉందని, దీంతో వెంటనే ఆ కొరత తీర్చాలని సీఎం ఆదేశించారని వెల్లడించారు. అదేవిధంగా దవాఖానలో ఆక్సిజన్, మందులు తగిన మోతాదులో ఉన్నాయని చెప్పారు. ఎజీఎంపై ప్రజలకు నమ్మకం పెరిగినందువల్లే రోగులు పెరిగారని తెలిపారు.

సెంట్రల్ జైలు తరలింపుకు సీఎం మంచి ఆలోచన చేశారని, జైలు వెనక ప్రస్తుతం 23 ఎకరాల ఖాలీ స్థలం ఉందని చెప్పారు. అక్కడ సూపర్ స్పెషాలిటీ దవాఖానకు సంబంధించిన నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని, ప్రస్తుతం ఉన్న ఎంజీఎంను మాతా శిశు సంరక్షణ కేంద్రంగా మార్చాలని సీఎం సూచించారని వెల్లడించారు. వరంగల్‌ను హెల్త్ హబ్‌గా తయారు చేయాలన్నదే సీఎం ఆలోచనని చెప్పారు. వరంగల్ ప్రజలు, ప్రజాప్రతినిధులందరి తరుపున సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నామని వెల్లడించారు. తన రాజకీయ జీవితంలో ఇలాంటి ముఖ్యమంత్రిని ఎప్పుడూ చూడలేదన్నారు.

ప్రధాని మోదీ బయటకు రావాలని, రాష్ట్రాల్లో తిరగాలని సూచించారు. పబ్లిసిటీ కోసం మీడియాలో కనిపించడం కాకుండా, ప్రతి రాష్ట్రంలో పర్యటించి వాస్తవ పరిస్థితులను తెలుసుకోవాలని చెప్పారు. ప్రధానికి గుజరాత్ తప్ప ఏ రాష్ట్రం కనిపించడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. కనీసం వ్యాక్సినైనా వేయించే సోయి లేదని విమర్శించారు. కేంద్ర మంత్రులు సైతం రాష్ట్రాల్లో పర్యటించాలని చెప్పారు. బీజేపీ నేతలు పిచ్చి మాటాలు మానుకోవాలని హితవు పలికారు. పైసాకు అక్కరికి రాని బీజేపీ నేతలు కూడా ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు.

ఏపీలో ఆరోగ్య శ్రీ పరిధిలోకి 95 శాతం ప్రజలు

అమరావతి, మే 22: వైద్యం కోసం పేద, మధ్యతరగతి ప్రజలు ఎవరూ ఇబ్బంది పడకుండా అందరికీ నాణ్యమైన వైద్యం అందించాలన్న సంకల్పంతో వైద్య రంగంలో రాష్ట్ర ప్రభుత్వం పెనుమార్పులకు శ్రీకారం చుట్టింది.డా.వైఎస్సార్ ఆరోగ్యశ్రీ: వైద్య సేవల రంగంలో విప్లవాత్మక అడుగులకు శ్రీకారం చుడుతూ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో "డా. వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ" పథకం ద్వారా క్యాన్సర్ తో సహా 2,434 వైద్య ప్రక్రియలకు ప్రభుత్వం ఉచితంగా చికిత్సలు అందిస్తోంది. ఆరోగ్య శ్రీ సేవలను మరింత విస్తృతపరిచేందుకు హైదరాబాద్, బెంగుళూరు, చెన్నై నగరాలలోని 130కి పైగా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ ను కూడా ఆరోగ్యశ్రీ నెట్ వర్క్ పరిధిలోకి తీసుకురావడం జరిగింది. వైద్యం ఖర్చు రూ.1,000 దాటిన అన్ని చికిత్సలకు డా. వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ ద్వారా ఉచిత వైద్య సేవలు అందించడానికి శ్రీకారం చుట్టింది. ఆదాయ పరిమితిని 5 లక్షలకు పెంచడంతో రాష్ట్రంలోని దాదాపు 95 శాతం కుటుంబాలకు డా. వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా లబ్ది చేకూరుతుంది. ఆరోగ్యశ్రీ నెట్ వర్క్ ఆస్పత్రులకు గత ప్రభుత్వం పెట్టిన రూ. 680 కోట్ల బకాయిలు చెల్లించడంతో పాటు, జూన్ 2019 నుండి ఇప్పటివరకు చెల్లించాల్సిన మరో రూ.2,398 కోట్ల బిల్లులు ప్రస్తుత ప్రభుత్వం చెల్లించింది. పుట్టుకతో వినికిడి లోపం ఉన్న చిన్నారులకు రెండు చెవులకూ కాక్లియర్ పరికరం అమర్చి సేవలందిస్తోంది.వైఎస్సార్ ఆరోగ్య ఆసరా: ఆరోగ్యశ్రీ లో శస్త్ర చికిత్స అనంతరం విశ్రాంతి సమయంలో రోగులు కోలుకునే వరకు వారి జీవనోపాధికి ఎలాంటి ఇబ్బంది లేకుండా డా.వైఎస్సార్ ఆరోగ్య ఆసరా పథకం ద్వారా రోజుకు రూ. 225ల చొప్పున గరిష్టంగా నెలకు రూ.5,000ల వరకు, డాక్టర్ల సూచన మేరకు ఎన్ని రోజులు అవసరమైతే అన్ని రోజులూ రోగులకు చెల్లించడం జరుగుతోంది.ఆసుపత్రులలో నాడు?నేడు: ప్రభుత్వ ఆసుపత్రుల రూపురేఖలు సమూలంగా మార్చి పేదవాడికి కూడా కార్పొరేట్ వైద్య సేవలు అందించేందుకు వీలుగా నాడు-నేడు పథకం కింద ఆసుపత్రుల ఆధునికీకరణ పనులు పెద్దఎత్తున చేపట్టడం జరిగింది. ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 10,032 వైఎస్సార్ విలేజ్ క్లినిక్ లు, 560 అర్బన్ హెల్త్ క్లినిక్ ల నిర్మాణం, 1,147 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 52 ఏరియా ఆసుపత్రులు, 191 కమ్యూనిటీ హెల్త్ సెంటర్లను ఆధునికీకరించి మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోంది. ప్రతి ఆసుపత్రిలో అవసరమైనంత మంది సిబ్బంది ఉండేలా 9,712 డాక్టర్లు, నర్సులు, వైద్య సిబ్బంది పోస్టుల నియామకం చేపట్టడం జరిగింది.

కరోనా బాధితులకు, వైద్య సిబ్బందికి బాసటగా నిలుస్తున్న మై వాట్సాప్ గ్రూప్ సభ్యులు

రాజన్న సిరిసిల్ల మే, 22(నేటినిజం ప్రతినిధి): మై వేములవాడ వాట్సాప్ గ్రూపు తరఫున ఐదవరోజు కార్యక్రమంలో భాగంగా వేములవాడ లక్ష్మీగణపతి కాంప్లెక్స్లో ఉన్న ఐసోలేషన్ సెంటర్లో కరోనా పాజిటివ్ పేషేంట్లకు మరియూ డ్యూటీలో ఉన్న వైద్య సిబ్బందికి శుక్రవారం ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం అందిస్తూ బాసటగా నిలుస్తున్నారు . ఈ సందర్భంగా మై వేములవాడ వాట్సప్ గ్రూప్ సభ్యులు మాట్లాడుతూ అలాగే రాత్రికి కూడా భోజనం సమకూర్చనున్నట్లు తెలిపారు. అంతేకాకుండా లాక్డౌన్ పూర్తి అయ్యేవరకూ ప్రతీరోజు అల్పాహారం, భోజనం అందించనున్నట్లు గ్రూపు సభ్యులు తెలిపారు. ఐసోలేషన్ లో కరోనా వైరస్ బారినపడి ఇబ్బందులకు గురి అవుతున్న పేషెంట్లకు దగ్గరకు వెళ్లి వారిని పలకరించి ధైర్యంగా ఉండాలని మనో ధైర్యాన్ని కల్పిస్తూభోజనాలను అందిస్తున్నారు. తోటి వారు కూడా వారికి సూచనలు సలహాలు ఇస్తూ అండగా నిలవాలని వారు అన్నారు. విషయంలో కార్యక్రమంలో కుమ్మరి శంకర్, మధు మహేష్, ,దూలం సంపత్ , నూగురి మహేష్ , రంగుల శ్రీనివాస్, పంబి కృష్ణ, మరియూ మామిడిపెల్లి శ్రీకాంత్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించిన ఎమ్మెల్యే పెద్ది

వరంగల్ రూరల్, మే 22: ఖానాపురం మండలం ధర్మారావుపేట, మంగళవారిపేట, మనుబోతులగడ్డ, అశోక్ నగర్ గ్రామాల్లోని యాసంగి ధాన్యం కొనుగోలు కేంద్రాలను నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి సందర్శించారు. కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం నిల్వలను పరిశీలించి ట్రాన్స్ పోర్టుపై అధికారులతో చర్చించారు.ధాన్యం నిల్వలు పేరుకుపోయిన దృష్ట్యా కొనుగోలు కేంద్రాల నుంచి సొంత వాహనాల ద్వారా ధాన్యాన్ని రైస్ మిల్లులు, గోదాములకు రవాణా చేయాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం నుంచి రవాణా చార్జీలు ఇప్పించేందుకు రైతులకు ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

పోలీసులకు కామ్సన్ హెల్త్ కేర్ సంస్థ శానిటైజర్ పంపిణీ

మహబూబ్ నగర్, మే 22: శాంతిభద్రతల పరిరక్షణలో విశేషంగా కృషి చేస్తున్న పోలీసులకు అండగా ఉంటున్న వారందరికి కృతజ్ఞతలు తెలుపుతున్నామని జిల్లా ఎస్పీ రావిరాల వెంకటేశ్వర్లు తెలిపారు.

హైదరాబాద్ కు చెందిన కామ్సన్ హెల్త్ కేర్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ మనీష్ కుమార్ పోలీసు సిబ్బందికి ఉపయోగపడే విధంగా శానిటైజర్లను ఎస్పీకి అందించారు. విపత్తులు సంభవించి ప్రజలు ఇబ్బందుల్లో ఉన్నప్పుడు సమాజం మొత్తం మానవీయ కోణంలో స్పందించడం మనలోని ఐక్యతను చాటుతుందని ఎస్పీ పేర్కొన్నారు.

గత ఏడాది నుంచి ఒక కరోనా మహమ్మారి మనను ఇబ్బంది పెడుతోందన్నారు. ప్రజలంతా లాక్ డౌన్ సమయంలో బాధ్యతగా ఇంట్లోనే ఉండి సహకరించాలని కోరారు. పోలీసుల విధి నిర్వహణలో అవసరమైన శానిటైజర్స్ అందించిన కామ్సన్ హెల్త్ కేర్ ఎండీ మనీష్ ను అభినందించారు.

మంచిర్యాల జిల్లాలో విషాదం.. ఆకలితో అలమటించి వృద్ధ దంపతులు మృతి

మంచిర్యాల, మే 22: : జిల్లాలోని లక్సెట్టిపేట మండలం పాత కొమ్ముగూడెంలో ఆకలితో అలమటించి వృద్ధ దంపతులు మృతి చెందారు. పట్టించుకునేవారు లేక వారు చనిపోయినట్లు గ్రామస్తులు వెల్లడించారు. ఈ దంపతులకు ముగ్గురు కుమారులు ఉండగా, ఇటీవలే ఓ కుమారుడు చనిపోయాడు. మిగతా ఇద్దరు కుమారులు గ్రామం వదిలి వెళ్లారు.దీంతో ఆ వృద్ధ దంపతుల బాగోగులు చూసేవారే లేకుండా పోయారు. అనారోగ్యంతో మంచాన పడి, ఆకలితో అలమటించి ఆ దంపతులు చనిపోయినట్లు గ్రామస్తులు తెలిపారు. ఇంట్లో నుంచి దుర్వాసన రావడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతులను బియ్యాల రాజయ్య, మల్లమ్మగా పోలీసులు గుర్తించారు. ఘటనాస్థలిని మంచిర్యాల ఏసీపీ అఖిల్ మహాజన్ పరిశీలించారు.

హోం గార్డ్ బాబా మృతి... చాలా బాధాకరం



రాజన్న సిరిసిల్ల మే, 22(నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణానికి చెందిన హోంగార్డు బాబా శనివారం ఆరోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న టి ఆర్ కె ట్రస్ట్ వ్యవస్థాపకులు తోట రామ్ కుమార్ హోం గార్డ్ బాబా కుటుంబానికి ప్రగాఢ సానుభూతినిసంతా పాన్నదు బాదుబాయ్ నుండితెలియజేశారు.అలాగే టి ఆర్ కే ట్రస్ట్ డైరెక్టర్ మొట్టల మహేష్ కుమార్ ట్రస్టు సభ్యులతో బాబా ఇంటికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ట్రస్ట్ డైరెక్టర్ మహేష్ కుమార్ మాట్లాడుతూ హోం గార్డ్ బాబా తోట రామ్ కుమార్ కి చిన్ననాటి మిత్రుడు అని, హోంగార్డు బాబా వేములవాడ పట్టణ ప్రజలను నవ్వుతూ పలకరించే వాడని, అలాగే హోం గార్డ్ విధుల పట్లఅంకితభావం పని చేసేవాడని,

-బాబా కుటుంబ సభ్యులకు
-టి ఆర్ కె ట్రస్ట్ పరామర్శ

గతంలో కూడా మూలవాగు లో వరద ప్రవాహం ఎక్కువ ఉన్న సమయంలో ఒకరు కొట్టుక పోతుండగా తన ప్రాణాలను సైతం తెగించి కాపాడి కలెక్టర్ నుండి ప్రశంస పత్రాన్ని కూడా అందుకున్నాడని గుర్తు చేశారు. ఎప్పుడూ నవ్వుతూ పలువురిని పలకరించే బాబా మనమధ్య లేకపోవడం చాలా బాధాకరమని అన్నారు. ఆయన ఆత్మకుశాంతిచేకూరాలని టిఆర్ కె ట్రస్ట్ తరుపున కోరుకుంటున్నామని అన్నారు హోంగార్డు బాబు కుటుంబానికి సాయం చేయటానికి ట్రస్ట్ సేవలు ఎల్లప్పుడూ ఉంటాయని తెలిపారు ..

నిరుపేదలకు అండగా సీఎంఆర్ఎఫ్

సూర్యాపేట, మే 22: అభాగ్యులకు అండగా సీఎం సహాయ నిధి, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు నిలుస్తున్నాయని కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ అన్నారు. కోదాడలో లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద ప్రజలను ఆర్థికంగా ఆదుకునేందుకు ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తుందన్నారు. సీఎం సహాయ నిధి పేద ప్రజల కండ్లలో వెలుగులు నింపుతుం న్నారు.మానవతా దృక్పథంతో సీఎం కేసీఆర్ దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికి ఆర్థిక సహాయాన్ని మంజూరు చేస్తున్నారని ప్రశంసించారు. కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు పేదింటి ఆడ బిడ్డలకు వరంగా మారాయన్నారు. కార్యక్రమంలో కోదాడ ఎంపీపీ చింత కవిత రాధారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చెంతన లేకున్న .. చింత తీర్చే మారాజు

రాజన్న సిరిసిల్ల మే, 22(నేటినిజం ప్రతినిధి): ఇక్కడ పుట్టి, ఇక్కడే పెరిగిన మనసున్న మహారాజు తాను ఎక్కడ ఉన్నా ఇక్కడి సమస్యల పైన అనునిత్యం తపించి పోతారు అని పేర్కొనడానికి వేములవాడ నియోజకవర్గ ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్ బాబు ఒక ఉదాహరణగా చెప్పవచ్చు అంటూ రుద్రవరం పిఎసిఎస్ చైర్మన్ రేగులపాటి కృష్ణదేవ్ అన్నారు.

మిడ్ మానేరు లో మునిగిపోయిన గ్రామాల ప్రజల ఆకలి కేకలు ఎమ్మెల్యే రమేష్ బాబు విజ్ఞప్తి మేరకు గెజిట్ అయినా 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులకు డబ్బులు ఇస్తే ఆయా గ్రామాల్లో కొంచెం మానసిక ఒత్తిడి తగ్గుతుంది. ఈ విషయమై ఎమ్మెల్యే రమేష్ బాబు పదే పదే అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారనీ, పెండింగ్ సమస్యలు కూడా అన్ని త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆయన కోరినట్లు తెలిపారు.

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas.
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.